
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 18 మార్చి 2025



ప్రశాంతంగా పది పరీక్షలు

- గుంటూరులో కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్
- విధుల్లో నిర్లక్ష్యం....ఇద్దరు సిబ్బందిపై వేటు



గుంటూరు శారదానికేతన్ పరీక్షా కేంద్రంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(విద్య),మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు చిన్న చిన్న సంఘటనలు మినహా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో రేణుక వెల్లడించారు. జిల్లాలో 150 కేంద్రాల్లో పది పరీక్షలు, 8 కేంద్రాల్లో దూర విద్య పది పరీక్షలు జరిగాయి. పదో తరగతి పరీక్షలకు మొత్తం 27,506 మంది విద్యార్థులకు గాను 27,350 మంది హాజరయ్యారు. పరీక్షకు 156 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా ప్రైవేటుగా పరీక్షకు హాజరైన 147 మందిలో 105 మంది హాజరు అయ్యారు. దూర విద్య పది పరీక్షకు 12 మందికిగాను 9 మంది హాజరయ్యారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్..

పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తనిఖీ చేశారు. బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో కేద్రాలను ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలో మంచి నీరుతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఎండల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, మెడికల్ క్యాంపుతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కేంద్రాల్లో ఉండేలా చూడాలని, ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అదే విధంగా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులురెడ్డి కేంద్రాలను తనిఖీ చేశారు.



నెంబర్లను పరిశీలిస్తున్న విద్యార్థులు , తల్లిదండ్రులు

విధుల్లో నిర్లక్ష్యం..ఇద్దరు సిబ్బందిపై వేటు..

పదో తరగతి పరీక్షల విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగుల్ని డీఈవో రేణుక సస్పెండ్ చేశారు. గుంటూరు హిందూ కళాశాల హైస్కూల్ సెంటర్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల రోల్ నంబర్స్ బోర్డు ఏర్పాటు చేయలేదు. ఈ విషయం గురించి తల్లిదండ్రులు కేంద్రం సీఎస్‌ను ప్రశ్నించగా వారిపట్ల ఆయన దురుసుగా వ్యవహరించారు. ఈ విషయం డీఈవో దృష్టికి తల్లిదండ్రులు తీసుకెళ్ళడంతో అక్కడ విధుల్లో ఉన్న గోవిందయ్యను సస్పెండ్ చేశారు. అదే విధంగా తెనాలి ఐతానగర్ ఎన్ఎస్ఎం మున్సిపల్ స్కూల్‌లో ఇన్విజిలేటర్ నీలిమా ప్రశాంతి విద్యార్థులకు ఒక పేపర్ బదులు మరొక పేపర్ ఇచ్చారు. దీంతో ఆమెను సస్పెండ్ చేసి, చీఫ్ సూపరింటెండెంట్‌ను సంజాయిషీ కోరుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిట్నెస్ కోసం.. తిప్పలు

- ఎఫ్‌సీ జారీలను ప్రైవేట్ వ్యవస్థకు అప్పజెప్పిన కేంద్రం
- పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు జిల్లాలో ఏర్పాటు
- చలానాల్లో 50-50 వాటా పద్ధతిలో ఏజెన్సీకి బాధ్యతలు
- జర్మనీ యంత్రాలతో వాహనాల చెకింగ్
- ఫిట్నెస్ పేరుతో అడ్డగోలుగా వెనక్కి పంపుతున్న నిర్వాహకులు
- అదే పనిగా చలానాలు వసూలు
- అనుమతులు లేకుండానే శ్లాట్ బుకింగ్‌లు
- తీవ్రంగా ఇబ్బంది పడుతున్న వాహన యజమానులు
- ప్రైవేటు విధానాన్ని వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

దోపిడీ ఇలా సాగుతుంది..

అటోమేటిక్ ఫిట్నెస్ టెస్టింగ్ అండ్ సర్టిఫికేషన్ ప్రకారం అయా వాహనాలకు చలానాలను నిర్ణయించారు. దీని ప్రకారం లైట్ మోటారు వెహికల్ (ఆటో, టాటా ఏస్‌లు, అప్పి) వాహనాల ఫిట్నెస్ పరీక్షలకు రూ. 600, సర్టిఫికెట్ కోసం రూ. 200, జీఎస్టీ రూ. 144, యూజర్ ఛార్జీలు రూ. 120 మొత్తం రూ. 1064 చలానా చెల్లించాలి. భారీ వాహనాల పరీక్షలకు రూ వెయ్యి, జీఎస్టీ రూ 216 మిగతా సర్టిఫికెట్, యూజర్ ఛార్జీలు యథావిధిగా చెల్లించాలి. ఇందులో సగం అంటే 50 శాతం వాటా నిర్వాహకులకు వస్తాయి. కాకపోతే సగం వాటా కోసం ఎఫ్‌సీలను ఉద్దేశపూర్వకంగా రిజెక్ట్ చేస్తున్నారని వాహన యజమానులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఫిట్నెస్ పూర్తయిన తరువాత బయటకు రాగానే అక్కడ పనిచేసే సిబ్బంది రూ. 400 అడుగుతున్నారు.

గుంటూరు(తూర్పు), మార్చి 17(ఆంధ్రజ్యోతి): మారుతున్న నియమాలు, భారీ జరిమానాలతో రవాణా రంగం ఇప్పటికే కుదేలవుతుంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో వాహన యజమానులను మరింత కష్టాల్లోకి నెడుతోంది. కీలకమైన ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఫిట్నెస్ పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఆర్టీఏ) పరిధిలో ఉండేది. ఫిబ్రవరి 7న ఎఫ్‌సీ వ్యవస్థను ప్రైవేటు పరం చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు జిల్లాను ఎంపిక చేశారు. ప్రతి వాహన తనిఖీకి సంబంధించిన చలనాలో 50 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లాకు సంబంధించిన కార్యాలయాన్ని ఏటుకూరు రోడ్డులో రాయల్ ఏజెన్సీస్ పేరుతో నిర్వాహకులు ఆటోమేటిక్ ఫిట్నెస్ టెస్టింగ్ అండ్ సర్టిఫికేషన్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఫిట్నెస్ పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలను పర్యవేక్షిస్తున్నారు. కాకపోతే నెల రోజుల గడవక ముందే ఈ ఏజెన్సీపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ప్రభుత్వం పరిధిలో ఉన్న ఈ వ్యవస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడంతో వాహన యజమానుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. ఫిట్నెస్ పరీక్షల కోసం సదరు ప్రైవేటు ఏజెన్సీ తీసుకొచ్చిన యంత్రాన్ని బూచిగా చూపి భారీ దోపిడికి తెరలేపారు. నిబంధనల పేరుతో నిష్కారణంగా రిజెక్ట్ చేసి, అదేమని అడిగితే మరోసారి చలానా కట్టుకోవాల్సిందేనని అడ్డగోలుగా సమాధానం చెబుతున్నారు. దీంతో ఎఫ్‌సీ కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు అనుభవం లేని వ్యక్తులను పెట్టి పరీక్షలను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరూ వహిస్తారనే సమస్య తలెత్తుతుంది.



ఏజెన్సీ ఎదుట ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం బారులు తీరిన వాహనాలు

- **శ్లాట్ బుకింగ్‌ల వద్ద దళారులు పాగా**

ఎఫ్‌సీ పేరుతో ఏజెన్సీ దోచుకుంటుంటే, స్లాట్ బుకింగ్‌ల పేరుతో దళారులు

(మిగతా 8వ పేజీలో)

- **రిజెక్ట్ పేరుతో భారీ దోపిడి**

నూతనంగా ఏర్పాటు చేసిన జర్మనీ యంత్రం సాయంతో నిర్వాహకులు ఫిట్నెస్ పరీక్షలకు వచ్చిన వాహనాలను అధిక సంఖ్యలో రిజెక్ట్ చేస్తుంది. రోజుకు 100కు పైగా వాహనాలను తనిఖీ చేస్తే వాటిలో 80 శాతం రిజెక్ట్ చేస్తుంది. ఫిట్నెస్ కోసం కేంద్రం రూపొందించిన 35 నిబంధనల్లో 20 నియమాలు పాటిస్తే ఎఫ్‌సీ జారీ చేయాలని నియమాలు ఉన్నాయి. కానీ కేంద్రం పెట్టిన అన్ని నిబంధనలను బూచిగా చెప్పి ఉద్దేశపూర్వకంగా రిజెక్ట్ చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు ఎఫ్‌సీ కాలపరిమితి ముగిసిన ప్రతి రోజుకు ఆటోకు రూ. 20, క్యాబ్, లారీ రూ. 50 చొప్పున జరిమానా పడుతుందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాత్కాలిక మేయర్‌గా.. సజీల?

- కొత్త మేయర్‌ను ఎన్నుకునే వరకు ఆమెకే అవకాశం
- ఇద్దరు డిప్యూటీ మేయర్ల పేర్లు ప్రభుత్వానికి పంపిన అధికారులు
- రెండు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశం
- 20వ తేదీ తరువాత ఏ రోజైనా ఎన్నిక

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ రాజకీయం రసవత్తరంగా మారింది. వైసీపీకి చెందిన మేయర్ కావటి మనోహర్‌నాయుడు సైన్యం లేని సేనానిగా మిగిలిపోవటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తన పదవికి రాజీనామా చేశారు. ఒక రకంగా మేయర్ పీఠంలో నుంచి దించేసే వరకు ఆగకుండా ముందస్తు రాజీనామాతో కావటి తన పరువును కాపాడుకున్నారు. అంతేకాకుండా అనవసరపు ఖర్చును కూడా ఆదా చేసుకున్నాడని చెప్పవచ్చు. అవిశ్వాసం ప్రకటించే వరకు ఉంటే ప్రస్తుతం వైసీపీ పక్షాన ఉన్న కార్పొరేటర్లతో క్యాంపు నిర్వహించి వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వచ్చేది. అంత కష్టపడినా చివరి నిమిషంలో తన పక్కన ఉన్న కార్పొరేటర్లు పార్టీ ఫిరాయించే అవకాశం ఉందనే భయంతోనే ఆయన స్వచ్ఛందంగా మేయర్ స్థానం నుంచి తప్పుకోవటం జరిగింది. దీంతో కొత్త మేయర్ ఎన్నిక ప్రక్రియకు నగరపాలక సంస్థ అధికారులు శ్రీకారం చుట్టారు. మేయర్ రాజీనామా విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తూ కొత్త మేయర్ ఎన్నిక తంతు జరిగే వరకు మేయర్ పీఠంపై తాత్కాలికంగా ఎవరిని కూర్చోపెట్టాలో సూచించమని ప్రభుత్వాన్ని కోరుతూ నివేదిక పంపించారు. ప్రస్తుతం నగరపాలక సంస్థలో ఇద్దరు డిప్యూటీ మేయర్లుగా ఉన్నారు. వారిలో ఒకరైన షేక్ సజీల టీడీపీ పక్షాన ఉన్నారు. వాస్తవానికి ఆమె వైసీపీ తరుపునే కార్పొరేటర్‌గా గెలుపొందినప్పటికీ ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలకు ముందే టీడీపీలో చేరి పార్టీ విజయానికి కృషి చేశారు. అలాగే రెండో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు వైసీపీలోనే కొనసాగుతూ ప్రస్తుతం తాడికొండ నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ రెండు పేర్లను ప్రభుత్వానికి సూచిస్తూ ఎవరి ఆధ్వర్యంలో మేయర్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించాలో ఆదేశించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరటం జరిగింది. డిప్యూటీ మేయర్ షేక్ సజీల అధికార పార్టీలో ఉన్నందున ఆమె పేరునే ప్రభుత్వం సూచించనున్నది. రెండు రోజుల్లో దీనిపై ప్రభుత్వం నుంచి నగరపాలక సంస్థ అధికారులకు ఆదేశాలు రానున్నాయి. కాగా ఈ నెల 20వ తేదీన ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి ప్రభుత్వం సూచించిన డిప్యూటీ మేయర్ తాత్కాలిక మేయర్‌గా పీఠాన్ని అధిష్టించనున్నారు. ఆ సమావేశంలో మేయర్ రాజీనామాను ఆమోదించి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళి ఎన్నికల తేదీని నిర్ణయించాల్సిందిగా కోరనున్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన తేదీన జిల్లా కలెక్టర్ సమక్షంలో తాత్కాలిక మేయర్ ఆధ్వర్యంలో కొత్త మేయర్ ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తారు. సమావేశానికి హాజరైన సభ్యులు చేతులెత్తి మద్దతు తెలపాల్సి ఉంటుంది. హాజరైన సభ్యుల్లో సగంమంది కంటే ఒక్కరైనా మద్దతు తెలిపిన పక్షంలో మేయర్ ఎన్నిక ప్రక్రియ ముగుస్తుంది. కూటమి తరుపున ఒక్కరే ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఉన్నందున ఇప్పటికున్న బలమే సరిపోయి మేయర్ ఎన్నిక ఏకపక్షమయ్యే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (మంగళవారం సాయంత్రం)
సహరి : 4.57 (బుధవారం ఉదయం)

అర్జీదారులకు.. భోజనం

- అక్షయపాత్ర సాయంతో మొదలు పెట్టిన ప్రభుత్వం
- ప్రారంభించిన కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
- ప్రభుత్వ నిర్ణయం పట్ల అర్జీదారుల్లో హర్షం

గుంటూరు(తూర్పు), మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల ఆకలి తీరనుంది. సమస్యలు విన్నవించేందుకు వచ్చే ఫిర్యాదుదారులకు, వారితో పాటు వచ్చే సహాయకులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుం ది. గత ఆరేళ్లుగా ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పునరుద్ధరించింది. అక్షయపాత్రతో ఒప్పందం కుదుర్చుకొని ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ శంకరం సమావేశ మందిరం ఆవరణలో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ప్రారంభించారు. అర్జీదా రులకు భోజనాన్ని స్వయంగా అందజేసి, ఏర్పాట్లుపై.... భోజనం ఎలా ఉందని అర్జీ దారులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 300 మంది పైగా అర్జీదారులు భోజనం తిని సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వినతి పత్రాలు అంద జేయటానికి గుంటూరు వచ్చి తిరిగి వెళ్లే సమయంలో డబ్బులు లేక భోజనానికి ఇబ్బందులు పడ్డామని, ప్రభుత్వ నిర్ణయంతో కలెక్టరేట్‌లోనే భోజనం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గతంలో టీడీపీ హయాంలో 2014-19 మధ్య కాలంలో కమ్మ జన సేవా సమితి సహకారంతో అర్జీదారులకు భోజనం అందజేసింది. ఆ తర్వాత వైసీపీ ఈ కార్యక్రమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కొంతమంది దాతలు ముందుకు వచ్చినప్పటికి పాలకుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఈ కార్యక్రమం పూర్తిగా నిలిచిపోయింది. తిరిగి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడంపై అర్జీదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ, డీఆర్వో షేక్ ఖాజావలీ

రూ.1534 కోట్ల అంచనాలతో వార్షిక బడ్జెట్‌కి ఆమోదం

- స్టాండింగ్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన కొమ్మినేని

గుంటూరు కార్పొరేషన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వార్డుల వారీగా సమగ్రాభివృద్ధికి దోహదపడేలా సుమారు 361 పనులకు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన కొమ్మినేని కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్టాండింగ్ కమిటి సమావేశం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర మేయర్ హాజరు కానందున ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ 1955 ప్రకారం స్టాండింగ్ కమిటీ సభ్యుల్లో ఒకరిని సమావేశానికి తాత్కాలిక అధ్యక్షుడిగా ఎన్నుకోవచ్చన్న నిబంధన మేరకు కమిటీ సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావుని అధ్యక్షుడిగా ఎన్నుకొని, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు, అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో రూ.670.23 కోట్ల ప్రారంభ నిల్వ, రూ.864.04 కోట్ల జమలు అంచనాలతో రూ.1534.27 కోట్ల 2025-26 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నూకవరపు బాలాజీ, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ, తదితర అధికారులు పాల్గొన్నారు.

డెకాయ్ ఆపరేషన్‌లో.. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

- మందుల దుకాణాలపై దాడులకు సిద్ధం
- కస్టమర్లుగా మఫ్టీలో పోలీసులు
- చీటీ లేకుండా మత్తు మందులు విక్రయిస్తే కేసులు
- నాలుగేళ్లుగా తగ్గిన తనిఖీలు

గుంటూరు మెడికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా మందుల దుకాణాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు చేసేందుకు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. జోన్‌ల వారీగా రిటైల్ మెడికల్ షాపులపై పెద్ద ఎత్తున దాడులు చేసేందుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సర్వం సిద్ధం చేశారు. ఎప్పటిలా జరిపే మొక్కుబడి తనిఖీల్లా కాకుండా ఈ దఫా.. ముందస్తుగా మఫ్టీలో ఉన్న పోలీసులను డెకాయ్ కస్టమర్లుగా (సాధారణ వినియోగదారుడుగా) మందుల దుకాణాలకు పంపుతారు. వీరికి సదరు దుకాణదారుడు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా..మత్తు బిళ్లలు, యాంటీ బయోటిక్ వంటి మందులు విక్రయిస్తే అడ్డంగా కేసులో ఇరుక్కుంటారు. పోలీసులనే సాక్షులుగా పెట్టి కేసులు నమోదు చేస్తారు. మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా తనిఖీలు జరిపేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే హోల్‌సేల్ రిటైల్ మందుల దుకాణాదారుల సంఘాలకు ముందుగానే ఈ సమాచారం అందించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయించినా, ఆయా మందులకు సరైన రికార్డులు నిర్వహించకపోయినా కేసులు నమోదు చేస్తామని ఔషధ నియంత్రణ అధికారులు హెచ్చరించారు.



శాఖ తీరుపై మంత్రి అసంతృప్తి...

నాణ్యమైన మందులు అందేలా చూడటానికి, ఔషధ నియంత్రణ శాఖ అనే వ్యవస్థ ఉందని, అది ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సమర్థవంతంగా పని చేస్తోందని అన్నభావన ప్రజల్లో కలిగేలా డీసీఏ పని చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉద్బోదించారు. గతవారం మంత్రి ఔషధ నియంత్రణ శాఖపై సమీక్ష జరిపి, పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీలు పెంచాలని, నాసిరకం, నాణ్యత లేని మందులను మార్కెట్ నుంచి ఏరివేయాలని ఆదేశించారు. ఆరోగ్య మంత్రి ఆదేశాలతో ఔషధ శాఖ అధికారులు దాడులకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.


తగ్గిన డీఐల తనిఖీలు...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల(డీఐ)ల తనిఖీలు బాగా తగ్గాయి. 2015-16 సంవత్సరంలో డీఐలు 538 దుకాణాలను తనిఖీలు చేయగా, 2023-24లో అది 501కి పడిపోయింది. డీఐలు సేకరించే మందుల నమూనాల విషయంలో కూడా చిత్తశుద్ధి కొరవడినట్లు వెల్లడైంది. నమూనా విధానం, నాణ్యతలను సూచించే దిశగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సేకరించే నమూనాల్లో మూడు శాతం నాట్ ఆఫ్ స్టాండర్డ్ క్వాలిటీ (ఎన్ఎస్‌క్యూ) ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. 2015-19 కాలంలో ఎన్ఎస్‌క్యూ నాలుగు శాతం ఉండగా, 2019-20లో 2.22 శాతం, 2023-24లో 1.52 శాతానికి పడిపోయింది. నామునాల సేకరణ యధాలాపంగా కాకుండా ముందస్తు సమాచారం ఇచ్చి సేకరణతో పటిష్ఠంగా జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వేరే పని మీద వెళుతూ దారిలో ఉండే మందుల షాపులను తనిఖీలు చేయకుండా, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా తనిఖీలు చేయాలని స్పష్టం చేసింది. కల్తీ మందులు ఏ రాష్ట్రం నుంచి జిల్లాలోకి వస్తున్నాయో నిఘా ఉంచాలని ఉద్బోదించింది.

ఈ మందుల పట్ల అప్రమత్తం

అలవాటుగా మారే ప్రమాదం ఉన్న మందులైన ఆల్ప్రాజోలామ్, బుప్రెనోర్ఫిన్, క్లోరోడై ఎజోఫాక్సైడ్, డైజీఫామ్, డైఫెనోక్సిలేట్, మిడాజోలామ్, నైట్రాజెఫామ్, పెంటాజోసిస్, ట్రమడాల్, జోల్పిడెమ్ వంటి మందుల విక్రయాలపై డీఐలు దృష్టి సారించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఈ మందులు విక్రయించడం నేరంగా పరిగణిస్తారు. ఈ మందులకు యువత బానిసలుగా మారుతున్నట్లు ఆరోపణలు రావడం, పలువురు రిటైల్ డ్రగ్గిస్టులు ఈ మందులను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో డీఐలు ఈ తనిఖీలు చేపట్టారు. యాంటీ బయోటిక్ మందులు అధికంగా విక్రయిస్తున్న రిటైల్ మందుల దుకాణాల సమాచారం తెప్పించుకొని ఆయా షాపులపై డెకాయ్ కస్టమర్లను ప్రయోగించాలని ప్రభుత్వం నుంచి డీఐలకు ఆదేశాలు అందాయి.

విజన్-2020 స్ఫూర్తితోనే 2047 : చీఫ్‌విప్ జీవీ


అసెంబ్లీలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో విజన్-2020 ద్వారా సాధించిన విజయాలే 2047 స్వప్నం సాకారానికి స్ఫూర్తి అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సోమవారం జరిగిన చర్చలో జీవీ మాట్లాడుతూ చంద్రబాబు విజన్‌కు, జగన్‌కు ఉన్న వ్యత్యాస్ని ప్రజలు గమనించారన్నారు. ప్రజల భాగస్వామ్యం, ఎన్‌డీఏ ఆధ్వర్యంలో సుస్థిర ప్రభుత్వంతోనే విజయ్-2047 తప్పక నెరవేరుతుందన్నారు. చంద్రబాబు అప్పట్లో విజన్-2020 అంటే కొందరు నమ్మలేదని, కంప్యూటర్లు అన్నం పెడతాయా అని అనుమానం వ్యక్తం చేసిన వారికి సైబరాబాద్ అభివృద్ధే ఒక నిదర్శనమన్నారు. 1996లో ఉమ్మడి ఏపీ ఐటీ ఆదాయం రూ.5వేల కోట్లు ఉంటే 2023-24లో హైదరాబాద్ నుంచి రూ.2.7లక్షల కోట్లు ఐటీ ఎగుమతులు జరిగాయన్నారు. ప్రతిరైతు కుటుంబం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు వచ్చారని, వా రంతా దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. ఏపీ లో కూడా 2047లో తలసరి ఆదాయం రూ.35లక్షలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారని, తప్పక సాధిస్తామన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు చేసిన అభివృద్ధిని జగన్ సర్వనాశనం చేశాడని, ఆ కలలన్నీ తిరిగి సాధించుకోవాలన్నారు.

బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలకు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే బర్లీ పొగాకు రైతుల పరిస్థితి అగ మ్యగోచరంగా ఉందని, వారికి అండగా నిలిచి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభు త్వాలపైన ఉందని స్థానిక శాసనస భ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సోమ వారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో అన్నారు. బర్లీ పొగాకు రైతుల సమస్యల్ని ఆయన సభ ద్వారా ప్రభుత్వం దృ ష్టికి తీసుకె ళ్లారు. 2023-24లో వర్జీనియా, బర్లీ పొగాకు ఎగుమతులు దాదాపు రూ.12 వేల కోట్లకు పైగా జరిగాయని చెప్పారు. గుంటూరులో పొగాకు బోర్డు ఉన్నా, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని, పొగాకు కంపెనీలు రైతులతో ఆటలాడుతున్నాయని అన్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ప్రధాన వాణిజ్యపంటగా సాగ వుతున్న బర్లీ పొగాకుకు సరైన ధరలేక ఈ సంవత్సరం రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత సంవత్సరం అడుగు ఆకు క్విం టాలు రూ.10 వేలకు కొంటే, ఈ ఏడాది రూ.4 నుంచి 5 వేలకు మించి ధర లేదన్నారు. కంపెనీలు బాండు ఇచ్చినా పొగాకు కొను గోళ్లు మందంగానే ఉన్నాయన్నారు. ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు ముందస్తు కౌళ్లు చెల్లించి బర్లీ పొగాకు వేసిన రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందన్నారు. అప్పులపాలైన వారి వేదనను ప్రభుత్వం ఆలకించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. బర్లీ పొగాకు రైతుల సమస్యపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తక్షణమే దృష్టి పెట్టాలని కోరుతున్నట్టు చెప్పారు.

ఏఎంసీల ఆర్‌వోఆర్‌ల ఖరారులో 'గుంటూరు' జాప్యం

- ఎనిమిదిలో నాలుగు మహిళలకు తప్పనిసరి
- మూడింటికి ఆమోదం తెలిపిన ఎమ్మెల్యేలు
- పల్నాడు, బాపట్లలో కలెక్టర్ ఆమోదంతో ప్రొసీడింగ్స్ జారీ


తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ

గుంటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్‌వోఆర్)ల ఖరారులో గుంటూరు జిల్లా పరంగా జాప్యం జరుగుతోన్నది. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అక్కడి ప్రజాప్రతినిధులు ఏకాభిప్రాయంతో కలెక్టర్లకు నివేదించగా వాటిని ఆమోదించి ప్రొసీడింగ్స్ ప్రక్రియ కూడా పూర్తి అయింది. గుంటూరులో మాత్రం ఇంకా ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఉన్న 8 ఏఎంసీలలో నాలుగు మహిళలకు కేటాయించాల్సి ఉండగా ఫిరంగిపురం, దుగ్గిరాల, ప్రత్తిపాడుని కేటాయించేందుకు దాదాపుగా ఆమోదం లభించింది. మిగతా ఒక్క ఏఎంసీ విషయంలో ఎమ్మెల్యేలు ముందుకు రావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మరో ఆరు జిల్లాల్లో ఇదే సమస్య ఉండటంతో ప్రభుత్వమే రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లను ఖరారు చేయాలని భావిస్తున్నది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. వీటిల్లో గుంటూరులో 8, పల్నాడులో 12, బాపట్లలో 4 ఏఎంసీలున్నాయి.

పల్నాడు జిల్లాలో ఉన్న నరసరావుపేట, చిలకలూరిపేట, రొంపిచర్ల, సత్తెనపల్లి, క్రోసూరు, రాజుపాలెం, పిడుగురాళ్ల, గురజాల, మాచర్ల, ఈపూ రు, వినుకొండ, దుర్గిలో మార్కెట్ కమిటీలున్నాయి. వీటన్నింటికి ఆయా ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రతిపాదనలతో రిజర్వేషన్లు ఖరారైపోయాయి. కలెక్టర్ ఆమోదంతో ప్రొసీడింగ్స్ ప్రక్రియ కూడా పూర్తి అయింది. గుంటూరు జిల్లాలో గుంటూరు, తెనాలి, తాడికొండ, ఫిరంగిపురం, పొన్నూరు, ప్రత్తిపాడు, దుగ్గిరాల, మంగళగిరి మార్కెట్ కమిటీలుండగా ఇక్కడ ఇంకా ఆర్‌వోఆర్‌లను ఖరారు చేయలేని పరిస్థితి నెలకొన్నది. బాపట్ల జిల్లాలో ఉమ్మడి గుంటూరు పరిధిలోకి వచ్చే కూచినపూడి, బాపట్ల, వేమూరు, రేపల్లె ఏఎంసీలకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి అయింది.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం కేటాయించాలి. అలానే బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు వైసీపీ హ యాంలో ఉండగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం దానిని 36 శాతానికి పెంచింది. దీంతో రిజర్వేషన్లలో కొన్ని సవరణలను చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. వీటన్నింటి కారణంగా ఆర్‌వోఆర్‌ల ఖరారు ప్రక్రియ ఆలస్యం అవుతుండటంతో ఏఎంసీలకు పాలకవర్గాలను ప్రభుత్వం నియమించ లేకపోతున్నది. ఈ నేపథ్యంలో ఏ జిల్లాకు ఆ జిల్లా కాకుండా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లను ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో మార్కెటింగ్ శాఖ ఆ దిశగా కసరత్తు జరుపుతున్నది. మరికొద్ది రోజుల్లో ఆర్‌వోఆర్‌లను ఒక కొలిక్కి తీసుకొచ్చి పాలకవర్గాలను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి
- న్యాయవాదుల క్రికెట్ పోటీలు ప్రారంభం


బ్యాటింగ్‌తో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు(లీగల్), మార్చి 17(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల వలన మానసిక ఉల్లాసం పెంపొందుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లా న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి పార్థసారథి మాట్లాడుతూ నిత్యం కోర్టుల్లో కేసుల వాదనలతో, కక్షిదారుల సమస్యలు తీర్చేందుకు సతమతమయ్యే న్యాయవాదులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం వల్ల కొంత ఆటవిడుపు లభిస్తుందన్నారు. గుంటూరు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించిన ఆయన కొద్దిసేపు బ్యాటింగ్ చేసి తన కళాశాల రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో నరసరావుపేట బార్ అసోసియేషన్ జట్టు గుంటూరు బార్ అసోసియేషన్‌లోని సూర్యప్రకాష్ 11 జట్టు పై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సూర్యప్రకాష్ 11 జట్టు 13.4 ఓవర్లలో 89 పరుగులకు ఆల్‌అవుట్ అయ్యింది. నరసరావుపేట జట్టులోని బుజ్జిబాబు కేవలం 4 ఓవర్లలో 7 పరుగులిచ్చి 7 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన నరసరావుపేట జట్టు 12 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో బాపట్ల బార్ అసోసియేషన్ న్యాయవాదుల జట్టు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ న్యాయవాదుల జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బాపట్ల జట్టు 20 ఓవర్లలో నాలుగు వికెట్‌లు కోల్పోయి 179 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సత్తెనపల్లి జట్టు 20 ఓవర్‌లు ఆడి 7 వికెట్లు కోల్పోయి 164 పరుగులు మాత్రమే చేయగలిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ ల ఫెడరేషన్ ఛైర్మన్ కాసు వెంకటరెడ్డి, గుంటూరు బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి ఇస్మాయిల్, నవ్యాంధ్ర అడ్వకేట్స్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఉమ్మడిశెట్టి మహతి శంకర్, న్యాయవాదుల జాతీయ జట్టు క్రీడాకారుడు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి యాత్ర

మంగళగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ధర్నాచౌక్ వరకు కన్నీటి పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్ని తిరుపతయ్య తెలిపారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ ఆర్థిక మోసాలకు పాల్పడి 11 సంవత్సరాలు కావొస్తున్నా బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ఆత్మహత్యలకు పాల్పడిన అగ్రిగోల్డ్ బాధితులకు రూ.పది లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తానని చెప్పిన మాజీ సీఎం జగన్ ఆ హామీని తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని, 9 నెలలైనా ఇంతవరకు స్పందించలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న కన్నీటి పాదయాత్రలో అగ్రిగోల్డ్ బాధితులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు చక్రధర్‌బాబు, కార్యదర్శి కే భాస్కర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతయ్య

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 519.00 అడుగులు ఉంది. ఇది 147.45 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,287 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రేపటి నుంచి విద్యుత్‌శాఖ

మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు

- మూడు రోజుల పాటు కొనసాగనున్న పోటీలు

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఎన్‌టీఆర్ స్టేడి యం వేదికగా విద్యుత్‌శాఖ ఇంటర్ సర్కిల్ మహిళా ఉద్యోగుల క్రీడా, సాంస్కృతిక పోటీలు ఈనెల 19న ప్రారంభం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖలోని మహిళా ఉద్యోగులకు ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఏపీ సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ లోని మూడు కంపెనీల మహిళా ఉద్యోగులు ఈ పోటీలకు తరలిరానున్నారు. విద్యుత్‌శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉన్న మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పోటీలకు తరలిరానున్నారు. కాగా మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు ఎన్‌టీఆర్ స్టేడియంలో, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు సంగడిగుంటలోని విద్యుత్ భవన్ ఆవరణలో జరుగనున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీడీసీఎల్ గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) తిరుమలశెట్టి శ్రీనివాసబాబు ఎన్‌టీఆర్ స్టేడియంలో క్రీడాపోటీలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. క్రీడా పోటీలను ఏపీ సీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ (ఎఫ్ఏసీ) ఏకేవీ భాస్కర్ లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- 9 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు
- సుమారు రెండు కిలోల గంజాయి స్వాధీనం


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్

మంగళగిరి సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలైన యువకులంతా ఓముఠాగా ఏర్పడి గంజాయి విక్రయాలను వృత్తిగా ఎంచుకున్నారు. ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్న ఓ యువకుడు ఒరిస్సా బోర్డర్ నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి తన ముఠా సభ్యుల ద్వారా కళాశాల విద్యార్థులు, యువతకు ఎక్కువ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. ఈ గంజాయి ముఠా గుట్టును మంగళగిరి రూరల్ పోలీసులు బట్టబయలు చేశారు. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ వై శ్రీనివాసరావు నిందితుల వివరాలను వెల్లడించారు. కాజ గ్రామానికి చెందిన చిలకపూడి భానుప్రసాద్ తరచు ఇచ్ఛాపురం కొండ ప్రాంతాలకు వెళ్లి అక్కడ స్మోర్ అలియాస్ గోవింద్ అనే వ్యక్తి వద్ద నుంచి కిలో గంజాయి రూ.8 వేల చొప్పున కొనుగోలు చేస్తుంటాడు. తన వద్ద ఉన్న గంజాయిని మంగళగిరి ప్రాంతానికి తీసుకువచ్చి 20 గ్రాముల చొప్పున ప్యాకెట్లుగా చేసి, ఒక్కో ప్యాకెట్‌ను రూ.వెయ్యి చొప్పున స్థానిక యువత కు విక్రయిస్తుంటాడు. దీంతోపాటు తన స్నేహితులైన కాజ గ్రామానికి తట్టు కోళ్ల డానియేల్ రాజు, ఆళ్ల సురేష్, తాటి వెంకటేష్, కాట్రగడ్డ మురళీకృష్ణ, కుక్క ల గణేష్, ఎర్రబాలెం గ్రామానికి చెందిన భీమవరపు శివసాయి మణికంఠ, విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన తిరుమల దుర్గాప్రసాద్, కాజ గ్రామానికి చెందిన సిరిబోయిన హరికృష్ణలకు గంజాయిని అలవాటు చేసి వారిని కూడా గంజాయి విక్రేతలుగా మార్చాడు. వీరంతా భానుప్రసాద్ వద్ద 20 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను రూ.వెయ్యికి కొనుగోలు చేసి రూ.1200 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. భానుప్రసాద్ గత నెల 26వ తేదీన ఇచ్ఛాపురం వెళ్లి రెండు కిలోల గంజాయిని తీసుకువచ్చాడు. సోమవారం ఉద యం కాజ గ్రామంలోని నంబూరు కెనాల్ వద్ద గంజాయిని తన ముఠా సభ్యు లకు పంచేందుకు సిద్ధమవుతుండగా మంగళగిరి రూరల్ పోలీసులు దాడి చేశా రు. మొత్తం 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు రూ.95 వేల విలువ చేసే 1900 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వడ్డేశ్వరం గ్రామానికి చెందిన హంస అఖిల్, ఇచ్ఛాపురంనకు చెందిన గోవింద్‌లు పరారీలో ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన భానుప్రసాద్‌పై బాల్యవివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం, మద్యం అక్రమ విక్రయాలకు సంబంధించిన కేసులున్నాయి. మరో ముగ్గురు నిందితులపై కూడా కేసులు ఉన్నాయి. ఈ సమావేశంలో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్, సిబ్బంది శ్యామ్, శేఖర్‌బాబు, చలమారావు, సాగర్‌బాబు, రాము, వేమన కుమార్, సురేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు యూనివర్సిటీగా మారనున్న 'వీవీఐటీ'

పెదకాకాని, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం నంబూరు పరిధిలో గల ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఇక నుంచి వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నోలాజికల్ యూనివ ర్సిటీ (వీవీఐటీయూ) ప్రైవేటు విశ్వవిద్యాలయంగా మారనుంది. ప్రైవేటు విశ్వవిద్యాలయం కోసం వీవీఐటీ కళాశాల చేసుకున్న దరఖాస్తుకు ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అనంతరం వీవీఐటీకు ప్రైవేటు యూని వర్సిటీ హోదా కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.



సాగు భూములు పంచేవరకు ఉద్యమం

- మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్


మాట్లాడుతున్న జల్లి విల్సన్, పాల్గొన్న సీపీఐ నాయకులు

గుంటూరు(తూర్పు), మార్చి 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ కష్ట జీవులకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు పంచేవరకు పోరాటాలు జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ స్పష్టం చేశారు. గుంటూరులోని మల్లయ్య లింగంభవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు సోమవారంతో ముగిసాయి. చివరి రోజు కార్యక్రమానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూములు అందుతాయనే కారణంతో ఆ సిఫార్సులను చెత్తబుట్టలో వేశారని మండిపడ్డారు. ప్రభుత్వం పంపిణీ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూపోరాటాలు చేసి ప్రభుత్వ భూములను పేదలకు పంచుతామని హెచ్చరించారు. ఇప్టా జాతీయ కార్యదర్శి ఘని మాట్లాడుతూ అటవీ భూముల్లో రాష్ట్ర వ్యాప్తంగా వనసంరక్షణ సమితిలను ఏర్పాటు చేసి అందులో వచ్చే ఫల సహాయం సాగుదారులకు అంద జేయాలన్నారు. ప్రభుత్వ భూములు సాగుకు ఉపయోగపడే వాటిని గుర్తించి భూపోరాటాలు చేయాలని, జూన్ 10న భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ పిలుపును జయప్రదం చేయాలన్నారు. సభలో సంఘ ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్ ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు ప్రసంగించారు. సమావేశంలో జంగాల అజయ్‌కుమార్, బండి వెంకటేశ్వరరావు, బి కేశవరెడ్డి,సి హెచ్ ప్రభాకర్, సి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మక్కెన శివతేజ (ఫైల్‌ఫోటో)

పిడుగురాళ్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల-గుంటూరు మార్గంలో వున్న శ్రీలక్ష్మీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద సోమ వారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమా దంలో రెంటచింతలకు చెందిన మక్కెన శివతేజ (30) అనే యువకుడు మృతిచెందాడు. శివతేజ పేరేచర్లలో కొబ్బరి బొండాల షాపు నిర్వహిస్తూ స్వగ్రామమైన రెంటచింతలకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా లక్ష్మీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో శివతేజ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మోహన్ సంఘ టనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిం చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమ బాటలో వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు

- ఏప్రిల్ 2 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు
- చీఫ్ సెక్రటరీకి నోటీసులు ఇచ్చిన తెలుగునాడు అసోసియేషన్

గుంటూరు సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. ఏప్రిల్ 2 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబును తెలుగు నాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం నాగరాజు,గౌరవ అధ్యక్షుడు మలినేని భానుమూర్తి సోమవారం కలిసి నోటీసులు అందజేశారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు మలినేని భానుమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చెప్పారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా సమస్యల పరిష్కారానికి చొరవ చూపక పోవటం దారుణమన్నారు. గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన జీఓ 143 ని రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని అడిగినా కనీస స్పందన లేకపోవడం దారుణమన్నారు. ఏఎన్ఎంలకు రీడిప్లాయ్ మెంట్ రద్దు చేయాలని, క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ తీసివేయాలని, శిక్షణ పొందిన ఏఎన్ఎంలకు జీఎన్ఎంలుగా ప్రమోషన్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. అవి గాక మరికొన్ని డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకువెళ్లినా పెద్దగా స్పందన లేకపోవడం గమనించమన్నారు. గత ప్రభుత్వం విధానం ఇప్పటి ప్రభుత్వం అమలు చేయడం దారుణమన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే తాము నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టటం ఖాయమని స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	96, 104, 115
చికెన్ విత్ స్కిన్(కిలో)	184.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	194.00

1,23,246 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,35,230 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,23,246 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,198 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13500
273	10000	13000
341	10500	14500
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11000	12500
బ్యాడిగి 355	10000	13800
సింజెంటా		
బ్యాడిగి 5531	10500	12000
దేవనూరు డీలక్స్	11500	13500
ఆర్మూరు	10000	11000
తాలుకాయలు	5000	7500

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న ఎమ్మెల్యే నసీర్

కరుణకు ప్రతీక రంజాన్ : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కరుణకు ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఎదుట వారికి సాయం చేయాలని, వారి కష్టాల్లో పాలుపంచుకోవాలని ఖురాన్ గ్రంథం చెబుతోందని వివరించారు. దేవుడు చూపిన మార్గంలో నడుస్తూ, అల్లా బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు

డాక్టర్ నాగూర్‌బాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్

గుంటూరు మెడికల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కేర్‌వెల్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పొన్నూరు రోడ్డు ముస్లిం కాలేజీలో రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. పలు రాజకీయ పార్టీ నాయకులు, నగర ప్రముఖులు, డాక్టర్లు ఈ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత్వానికీ, త్యాగానికీ రంజాన్ పండగ ప్రతీక అని తెలిపారు. సుమారు 4500 మంది ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేర్ వెల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగూర్‌బాషాతో పాటు మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాషా, ముస్లిం మతపెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అతిథులకు విందు వడ్డిస్తున్న డాక్టర్ నాగూర్‌బాషా

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

గుంటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం గ్రామ, వార్డు సచివాలయల పరిధిలో నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలను నిర్దేశించిన సమయానికి సక్రమంగా పూర్తి చేసేలా రోజువారి లక్ష్యాలను సంబంధిత సిబ్బందికి నిర్దేశించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్లు తహ సీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీ క్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు, దాతలు, ప్రభుత్వం భాగస్వామ్యం(పీ4) సర్వే బుధవారం నాటికి పూర్తి చేసేలా సచివాలయ ఉద్యోగులతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పీ4 కార్యక్రమంపై అభిప్రాయాల సేకరణపై రూపొందించిన పోస్టర్లను అన్ని సచివాలయాల వద్ద ఏర్పాటు చేసి క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను మార్చి 25 తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను వేగవంతం చేసి మార్చి 19 నాటికి పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాద్, డీపీవో సాయికుమార్, డ్వామా పీడీ శంకర్, సీపీవో శేషశ్రీ, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నర్సింహరావు, జిల్లా భూగర్భజలవనరుల శాఖ డీడీ వందనం, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రానున్న రెండు లేక మూడు నెలల్లో పేదలను గుర్తించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద అర్జీదారులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కమిటీ సభ్యులు రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, యశ్వంత్, జి.సురేష్ బాబు, దేవానాయక్, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు (చిన్నా), విరిగినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

● జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ గోపిచంద్

గుంటూరు (విద్య) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన ఉండాలని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ గోపీచంద్ అన్నారు. సోమవారం జేకేసీ కళాశాలలో వినియోగదారుల హక్కులు, సమస్యలు, కల్తీ వస్తువులు, ఆహార పదార్థాలపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. వినియోగ వస్తువులపై జరిగే మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. వినియోగదారుల హక్కులపై నిర్వహించిన పోటీల్లో శ్రీ నేహా, వన్షిక జైన్, దేవి ప్రసన్న, సంధ్య, స్వాతి అమర్నాథ్, తరుణ్ కుమార్, వర్ధన్ గౌడ్ తదితరులు విజయం సాధించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే.సాంబశివరావు, పీజీ కోర్సులు డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఆంగ్ల అధ్యాపకురాలు పీ నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ గోపీచంద్

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు-2 డిపో పరిధిలోని ప్రయాణి కులకు ఆర్టీసీ పరమైన సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఉదయం 11 గం టల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్య క్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-హైదరాబాద్, గుంటూరు- తెనాలి, గుంటూరు- విజయవాడ, గుంటూరు-విశాఖపట్నం రూట్‌లలో తిరుగుచున్న సర్వీసులతో పాటు సిబ్బంది పనితీరు గురించి ప్రయాణికులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు, సలహాలు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్- 2 డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నలందనగర్, బృందావన్‌గార్డెన్స్ రింగ్ రోడ్డు వైపు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలానే పట్టాభి పురం ఎన్‌సీసీ అపార్ట్‌మెంట్, డీఆర్‌ఎం ఆఫీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయి పెంచాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 217 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు(తూర్పు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయిని పెంచాలని అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 217 అర్జీలు వచ్చా యి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీ కుమారి, కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారున్ని సంప్రదిం చకుండా అర్జీలను క్లోజ్ చేయవద్దని సూచించారు. బియాండ్ ఎస్ఎల్ఏలో 37 అర్జీలు వెళ్లే అవకాశముందని వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఎంహెచ్‌వో డా. విజయలక్ష్మి, డీఎస్‌వో కోమలి పద్మ, డీపీవో నాగసాయి కుమార్, ఎల్ డీఎం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు కలెక్టర్‌కి వినతిపత్రం అందిం చారు. జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచి పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయలేదని తెలిపారు. 2018 జూలై 1 నుంచి పెన్షనర్లకు రావాల్సిన డీఆర్ బకాయిలు, 2020 ఏప్రిల్ నుంచి రావాల్సిన పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు అంజనేయరెడ్డి, లూర్థురెడ్డి తదితరులున్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాల ని ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 17ఏళ్లగా క్యాడర్ అమలు జరగకపోవడంతో ఎంటీఎస్ లేక, ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగిగా గుర్తింపు లేక తీవ్ర ఇబ్బం దులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన ఉద్యోగికి సరైన పరిహారం అందడం లేదని, పదవీ విరమణ తరువాత అందే సదుపాయాలు లేవని వాపోయారు. సంక్షేమ పథకాలను నిలిపివేశారని అన్నారు. దీనిపై ఉన్నాతాదికారులకు వినతిపత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారి లో అసోసియేషన్ సభ్యులు జాకీర్ హుస్సేన్, శ్రీను, శివకుమారి ఉన్నారు.

27న ఆర్టీసీ సీఎండీ కార్యాలయం ఎదుట మహాప్రదర్శన

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో విశ్రాంతి పొందిన కార్మికులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు ఇతర సమస్యలపై ఈనెల 27న విజయవాడలోని ఆర్టీసీ సీఎండీ కార్యాలయం ఎదుట మహా ప్రదర్శనకు విశ్రాంత ఉగ్యోగులు తరలిరావాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె గంగాధర రావు పిలుపునిచ్చారు. పాతగుంటూరులోని కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27న మహా ప్రదర్శనలో విశ్రాంత ఉద్యోగులతో పాటు సర్వీసులో ఉన్న ఉద్యోగులు కూడా హాజరుకావాలని కోరారు. పలు సమస్యల పరిష్కారం కోసం జరిగే ప్రదర్శనను విజయవంతం చేయా లని కోరారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం, శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. సోమవా రం ఉదయం స్వామికి ప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, సహస్ర నామార్చన నిత్య హోమం, మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్ర తీర్థ ఉత్సవం జరిగాయి. సాయంత్రం వేళలో ధ్వజావరోహణ, శ్రీపుష్పయాగం, పూలంగి, పవళింపు సేవ లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ తదితరులు పర్యవేక్షించారు.

భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం



ప్రవచనం చేస్తున్న చిన్మయమిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి

గుంటూరు(తూర్పు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జరుబుల బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో సోమవారం శ్రీమద్భగవద్గీత త్రయోదశ అధ్యాయంలోని క్షేత్రజ్ఞ విభాగయోగం ప్రవచనం చేశారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జరుబుల బంగారుబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచిస్తూ అంతఃకరణ స్థిరత్వం, మన శరీర ఇంద్రియాల నిగ్రహం కలవారు మాత్రమే క్షేత్రజ్ఞులు అవుతారని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి తెలియజేశారన్నారు.

మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు పోస్టులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి హైమారావు

గుంటూరు (విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అప్ గ్రేడ్ అయిన మున్సిపల్ ఉన్నత పాఠశాలకు టీచర్ పోస్టులు కేటాయించాలని నోబుల్ టీచర్ అసోసియేషన్ (ఎన్‌టీఏ)రాష్ట్ర కార్యదర్శి బీ హైమారావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఏటి అగ్రహారంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్ గ్రేడ్ అయినా పాఠశాలకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పీ లలితబాబు, జీ సతీష్‌బాబు, కూరపాటి రాజా, హరగోపాల్, వెంకటేశ్వర్‌రావు, ఎస్ నాగరాజు, కేవీ రాఘవులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం : డొక్కా

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యంపై మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు మాణిక్యవరప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇన్‌చార్జి చైర్మన్ కొమ్మినేని కోటేశ్వరరావు, సభ్యులు.
- గుంటూరు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

ఉద్యోగం కోసం డబ్బులు తీసుకుని మోసం చేశారు

● ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి మోసం చేశారని నగరానికి చెందిన ఎన్.వెంకటేశ్వరరావు సోమవారం ఎస్పీ కార్యాలయంలోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు ఎన్.భార్గవ్‌కు ఉద్యోగం నిమిత్తం ప్రయత్నిస్తుండగా ఉండవల్లికి చెందిన పూజిత జాబ్ కన్సల్టెన్సీ గురించి తెలిసి అక్కడకు వెళ్లామన్నారు. కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న పి పార్వతి అనే మహిళ తన కుమారుడికి తప్పనిసరిగా ఉద్యోగం ఇప్పిస్తానని ఇందుకుగాను ముందుగా అడ్వాన్స్‌గా 55 వేలు చెల్లించాలని చెప్పారన్నారు. దీంతో గత ఏడాది జూలై 21న తాము ఆమెకు 55 వేలు అడ్వాన్స్‌గా చెల్లించామన్నారు. మిగతా డబ్బులు రెండు లక్షల అరవై వేలు ఉద్యోగం వచ్చిన తర్వాత ఇవ్వాలని చెప్పారన్నారు. ఇదిలా ఉంటే గత ఏడాది సెప్టెంబర్ 21న హిటాచి కంపెనీ పేరుతో తమకు ఆఫర్ లెటర్ పంపించారన్నారు. అదే రోజు మిగిలిన రెండు లక్షల 60 వేలలో సగం అంటే లక్షా 30 వేలు కట్టించుకున్నార న్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత మిగతా రూ.లక్షా 30 వేలు చెల్లించాలని షరతు విధిం చారన్నారు. వారిచ్చిన ఆఫర్ లెటర్‌లో నవంబరు 4వ తేదీన ఉద్యోగంలో చేరాలంటూ జాయినింగ్ తేదీని ప్రకటించారన్నారు. అయితే తాము అంతవరకు ఎదురుచూసినా ఎటు వంటి లెటర్ రాలేదన్నారు. వారు పంపిన ఆఫర్ లెటర్ గురించి బయట విచారిస్తే అది ఫేక్ లెటర్ అని చెప్పారన్నారు. దీంతో తమ వద్ద తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని అడు గుతుంటే ఆ డబ్బు వేరే వారికి ఇచ్చామని వారు ఇవ్వగానే ఇస్తామంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారన్నారు. చట్టప్రకారం నిర్వహకులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు వెంకటేశ్వరరావు ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులను వేడు కున్నాడు.

డ్వాక్రా లీడర్ మోసం చేశారు

బ్యాంకు నుంచి తాము తీసుకున్న లోనుకు ప్రతినెలా డబ్బు చెల్లిస్తుంటే ఆ మొత్తం డ్వాక్రా గ్రూపు లీడర్ బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకుని మోసం చేశారని లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొబ్బరి కాయల సాంబయ్య కాలనీకి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వయం సహాయక సంఘం సభ్యులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తమ డబ్బు వాడుకుని మోసం చేసిన గ్రూపు లీడర్ మల్లికా బేగంపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు బిట్టు మల్లేశ్వరి, కోటగిరి విజయలక్ష్మి, హేమలత, దేవికరాణి, షేక్ మస్తాన్ బి, ఖాసింబి, గోవర్ధనమ్మ, శ్రీదేవి తదితరులు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నారు.

తక్కువ ధరకే కారు ఇప్పిస్తామని మోసం

గుంటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చైతన్యపురి కాలనీకి చెందిన భవనం అంజిరెడ్డిని తక్కువ ధరకే కారు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం అంజిరెడ్డి వ్యవసాయశాఖ అధికారిగా అర్బన్ నందు పని చేస్తున్నాడు. తోటి ఉద్యోగి బుల్లా కిశోర్ అనే వ్యక్తి ద్వారా కిరణ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. సదరు కిరణ్, సయ్యద్ యూసుఫ్ అను వారు కలిసి కేరళ రాష్ట్రంలోని టూటికోరన్‌లో వరదలలో డ్యామేజి అయిన కార్లు తక్కువ ధరకే అమ్ముతున్న ట్లు అంజిరెడ్డిని నమ్మించి అడ్వాన్సుగా లక్ష రూపాయలు తీసుకున్నాడు. ఇప్పటి వరకు కారు కానీ, తీసుకున్న డబ్బు కానీ తిరిగి ఇవ్వలేదు. దీంతో అంజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్ఫింగ్ ఫొటోలు వైరల్ చేస్తామని బెదిరింపు

భారత్‌పేటకి చెందిన సుంకేశుల దుర్గా శేఖర్ అనే అతడిని టెలిగ్రాం యాప్ ద్వారా అతడి మార్ఫింగ్ చేసిన ఫోటోలు వైరల్ చేస్తామని బెదిరించిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. దుర్గా శేఖర్ ఫోన్ హ్యాక్ చేసి అతడి నుంచి ఏటీఎం డిపాజిట్ ద్వారా రూ.లక్షా 65 వేల 201లు ట్రాన్స్ఫర్ చేయించుకొని ఇంకా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులకు డీఏ, ఐఆర్ ప్రకటించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు

గుంటూరు(విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉగాది కానుకగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, మధ్యంతర భృతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు గోవిందు వేళాంగణి రాజు, ప్రధాన కార్యదర్శి కట్టబోయిన నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అయినా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చలేదని అన్నారు. తెలుగు పండగ ఉగాదిన కరువు భత్యం, ఐఆర్ ప్రకటించాలని, క్రమ శిక్షణ చైర్మన్ జేవీ జయానందు, జిల్లా గౌరవ అధ్యక్షులు సూర్య ప్రకాశరరావు, సాయన్న, నాగార్జున, జోజప్ప, నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు విజ్ఞప్తి చేశారు.

పశువులకు చెవిపోగు వేయించాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు

గుంటూరు సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పశువులకు చెవిపోగు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు సూచించారు. ప్లాస్టిక్‌తో కూడిన చెవిపోగులు వేయించటం వల్ల పశువులకు ఏ విధమైన హానీ ఉండదని స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మనుషులకు ఆధార్ మాదిరిగానే, పశువులకు కూడా 12 అంకెలతో కూడిన పశు ఆధార్‌ను ఏర్పాటు చేయటం జరిగింద న్నారు. భారత పశుధాన్ యాప్‌లో ఈ సంఖ్య ఆధారంగా పశువులలో ఏ రకమైన టీకాలు వేసినా అలాంటి వివరాలను పశు సంవర్ధక శాఖ సిబ్బందిచే నమోదు చేయబడతాయని తెలిపారు.

అదేవిధంగా పశువులకు కృత్రిమ గర్భధారణ చేసినపుడు కూడా భారత పశుధాన్ యాప్‌లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. పశు బీమా చేసుకొనుటకు, ఏదైనా పశువు దొంగిలించబడినపుడు ఈ చెవిపోగు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ ఓ నరసింహారావు వెల్లడించారు.



డ్రైనేజిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు

మిర్చి తొడిమెల వ్యర్థాలతో ప్రజలకు ఇబ్బందులు

● ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ శ్రీనివాసులుకు పలు ఫిర్యాదులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మిర్చి తొడిమెలు తీసే గోడౌన్‌ల వద్ద వ్యర్థాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పలు ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్వాహకులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్యే, కమిషనర్ ఇద్దరు ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి చుట్టుగుంట సెంటర్ నుంచి మిర్చి యార్డు వరకు పర్యటించి, మిర్చి తొడిమెల గోడౌన్‌ల్లో పరిశీలించి యాజమాన్యాలతో మాట్లాడి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు, యాజమాన్యాలకు తగు ఆదేశాలు జారీ చేశారు. కొందరు తొడిమెలను రోడ్డుపై దహనం చేస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి, భారీ అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. మిర్చి తొడిమె లు తీసే గోడౌన్లలో ఎక్కువ మంది మహిళా కార్మికులు పని చేస్తున్నారని, యాజమాన్యా లు వారికి తాగునీరు, టాయ్‌లెట్స్ వంటి మౌలిక వసతులను కల్పించాలన్నారు. పర్యటన లో సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు శ్రీనివాస్, మధుసూదన్, కార్పొరేటర్ అడకా పద్మావతి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీరుస్తున్న ప్రభుత్వానికి ప్రజల కృతజ్ఞతలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలో ఆహారం తీసుకుంటున్న ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ, రూ.5తో ఆకలి తీరుస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని పశ్చిమ ఎమ్మెల్యే మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మిర్చియార్డు దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని ఇద్దరు కలిసి పరిశీలించి, టిఫిన్ చేసి, ప్రజలతో మాట్లాడి, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్చియార్డు దగ్గరలోని క్యాంటీన్‌లో పూటకు 5 వందల మందికి పైగా ఆహారం తీసుకుంటున్నారన్నారు. ప్రజలు కూడా ఆహార నాణ్యత, రుచిపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అన్నక్యాంటీన్లు పేదల ఆకలి తీర్చే అక్షయ పాత్రల వలే నిలిచాయయని తెలిపారు.

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

గుంటూరు(తూర్పు), మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటెపాడు, ఆంజనేయపేటలో కొలువైన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ- గోపయ్య స్వాముల వారి తిరునాళ్ల మహోత్సవాలు వైభవం గా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, చండీ, రుద్ర హోమాలు, పూర్ణాహుతి జరిగాయి. ఉత్సవాల్లో ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్ (రాజా), రవికుమార్, బాజీ తదితరులు పర్యవేక్షించారు.

ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన వైసీపీ సర్కార్

● ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తే ప్రభుత్వం వాటిని తెలుసుకుని పరి ష్కరించేందుకు కృషి చేస్తోందని ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ చెప్పారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ప్రజావేదిక' కార్యక్రమంలో మన్నవ మోహనకృష్ణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్య లు తెలుసుకొని పరిష్కారదిశగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్య లు తీసుకున్నారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ గత ప్రభు త్వ హయాంలో పడిన బాధలు గుర్తుచేసుకొని బాధితులు ఆవేదన చెందు తున్నారని అన్నారు. పలువురు తమ విజ్ఞప్తులను ప్రజావేదిక దృష్టికి తీసు కెళ్లగా మోహనకృష్ణ, గురుమూర్తి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు.



ప్రజావేదికలో వినతులు స్వీకరిస్తున్న మన్నవ మోహన కృష్ణ

పంచాయతీరాజ్ ప్రాజెక్టుల్లో గ్రామ పంచాయతీలకు 10శాతం నిధుల కేటాయింపు

● రాష్ట్ర పంచాయతీ పరిషత్ విజ్ఞప్తికి స్పందించిన ప్రభుత్వం

గుంటూరు సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన మరో హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేందుకు వీలుగా పంచాయతీరాజ్ ప్రాజెక్టు నిధుల్లో పంచాయతీలకు 10శాతం నిధులు కేటాయించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. పీఆర్ ప్రాజెక్టుల్లో గతంలో పంచాయతీలకు 5శాతం నిధులు కేటాయించే వారు. ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ పరిషత్ ఆ విషయాన్ని చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లటం జరిగింది. స్పందించిన చంద్రబాబునాయుడు నిధులను 10 శాతానికి పెంచుతామని హామీ ఇవ్వడంతోపాటు, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఈ విషయాన్ని చేర్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ పరిషత్ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అదే అంశంపై ప్రభు త్వానికి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. దానిపై స్పందించిన సీఎం కార్యా లయం పీఆర్ ప్రాజెక్టుల్లో గ్రామ పంచాయతీలకు 10 శాతం నిధులు మంజూరు చేసే విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఆదేశిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

సెల్లారులో నిర్మాణంపై ఫిర్యాదు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఓ షాపు యాజమాని పార్కింగ్ ప్రదేశాన్ని ఆక్రమించి నూతనంగా షాపులు నిర్మాణం చేపట్టారని సోమవారం గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో బాధితుడు పఠాన్ ఫిర్యాదు చేశారు. పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో వాహనాలు పెట్ట నీయకుండా భవన యాజమాని నూతనంగా షాపుల నిర్మాణం చేపట్టారు దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఫిట్నెస్ కోసం... తిప్పలు

(5వ పేజీ తరువాయి)

దోచుకుంటున్నారు. దళారులకు ఏజెన్సీ నిర్వాహకులు సహకరిస్తున్నారని విమర్శలు వినబడుతున్నాయి. పెద్దగా చదువులేని డ్రైవర్లు వీరి వలలో పడుతున్నారు. శ్లాట్ బుక్ చేసేందుకు అనుమతులు



ఫిట్నెస్ పరీక్ష కోసం వచ్చిన లారీ

లేకపోయినప్పటికీ, కార్యాలయంలోనే రూ. 1000 తీసుకుని, అనుమతులు జారీ చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే గతంలో ఆర్టీఏ కార్యాలయంలో ఇచ్చే వారు కదా...ఇప్పుడు కూడా ఇవ్వాలని దురుసుగా సమాధానం చెబుతున్నారు. దీనికి తోడు ఉదయం శ్లాట్ బుక్ చేసుకున్నవారు సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తుందని డ్రైవర్లు వాపోతున్నారు.

● భారీగా ట్రాఫిక్ జామ్

ఫిట్నెస్ పరీక్షల కోసం వచ్చిన వాహనాలతో అనంతవరప్పాడు రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు మీదే వాహనాలను నిలుపుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. దాదాపు నెల రోజులుగా ఈ పరిస్థితి ఏర్పడిందని, కనీసం నియంత్రించడానికి ట్రాఫిక్ సిబ్బంది కూడా లేరని వాహనదారులు వాపోతున్నారు.

● కోర్టులో రిట్ పిటిషన్

వాహన ఫిట్నెస్ ప్రక్రియ ప్రైవేటు ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ రవాణా అధికారులు, కార్మిక యూనియన్ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం ద్వారా నియమించిన ఉద్యోగులతో ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించాలే తప్ప, అనుభవం లేని వ్యక్తులతో ఈ పరీక్షలు నిర్వహిస్తే సరైన ఫలితాలు రావని, పైగా రోడ్డు ప్రమాదాలుకు కారణమవుతాయని పిటీషన్‌లో పేర్కొన్నారు.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాం



నూతనంగా తీసుకొచ్చిన ప్రైవేట్ ఏజెన్సీపై వాహన యజమానులు, డ్రైవర్లు, ఆటో రంగ సంఘ నాయకులు అనేక ఫిర్యాదులు చేస్తున్నారు. ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ఈ సమస్యను ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకు వెళతాం. ప్రైవేట్ ఏజెన్సీకి సంబంధించిన ఆర్టీఏ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, తనిఖీలపై గైడ్‌లైన్స్ రాలేదు.

-కే సీతారామిరెడ్డి (జిల్లా రవాణా ఉప కమిషనర్)

యంత్రం ద్వారానే ప్రక్రియ



ఎఫ్‌సీల ప్రక్రియ పూర్తిగా యంత్రం ద్వారానే జరుగుతుంది. మ్యానువల్‌గా జరగదు. రిజెక్ట్ చేస్తే మరోసారి చలానాలు కట్టుకుని రావాల్సిందే. శ్లాట్ బుకింగ్, అక్రమ వసూళ్లు చేస్తే సిబ్బందిపై చర్య లు తీసుకుంటాం. వాహనదారులు కచ్చితంగా వారి వాహనాన్ని పూర్తి కండిషన్‌లో ఉంచుకోవాలి...లేదంటే సర్టిఫికెట్ ఇవ్వలేం...

-ఎండీ ఆలీ, రాయల్ ఏజెన్సీ నిర్వాహకుడు

ఆందోళన చేపడతాం



ఫిట్నెస్ ప్రక్రియను ప్రైవేటు పరం చేయడం దారుణం. దీనిపై ఆందోళలకు సిద్ధమవుతున్నాం. ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశాం. ఇప్పటికే రవాణా రంగంలో ఎదురువుతున్న సమస్యలతో కార్మికులు రోడ్డు మీద పడ్డారు. ఇటువంటి విధానాలతో వాహన రంగం పూర్తిగా నిర్వీర్యమవుతుంది.

-ఎన్ శివాజీ, ఆలిండియా రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ (సీఐటీయూ) కార్యదర్శి

సోలార్ బిల్లు.. నిధులు నిల్లు



- సోలార్ విద్యుత్తుకు చెల్లింపులు చేయని విద్యుత్ శాఖ
- భారీ సబ్సిడీ ప్రకటనతో వేలాదిమంది సోలార్‌కు మొగ్గు
- కరెంటు సప్లై చేసిన వారికి ఇప్పటికీ లేని చెల్లింపులు
- నిధులు లేవంటున్న అధికారులు
- ప్రతి నెలా తప్పని కరెంటు బిల్లులు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సోలార్ విద్యుత్ పథకం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'! దేశంలో కోటి ఇళ్లపై సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యుత్ అందించడమే లక్ష్యంగా చేపట్టిన భారీ ప్రాజెక్టు అది. వినియోగదారులను ప్రోత్సహించడం కోసం భారీ మొత్తంలో సబ్సిడీ ప్రకటించడంతో వేలాది మంది సామాన్య, మధ్యతరగతి విద్యుత్ వినియోగదారులు ఈ స్కీము వైపు మొగ్గు చూపారు. ఇంత వరకూ అంతా బాగానే ఉంది. కానీ ఆ తరువాతే అసలు సమస్య మొదలయింది. రాష్ట్రంలోని విద్యుత్ అధికారుల నిర్వాకంతో లబ్ధిదారులు సోలార్ ప్లాంటు ఎందుకు పెట్టుకున్నామా? అని వాపోయే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ ప్లాంటు పెట్టుకున్న కారణంగా లబ్ధిదారులకు ఒనగూరుతాయని ప్రభుత్వం చెప్పిన ప్రయోజనాలు అందకపోగా, ప్రతి నెలా భారీ మొత్తంలో విద్యుత్ చార్జీల వడన తప్పడం లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గుంటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం కింద ఒక కిలో వాట్ ప్లాంటుకు రూ. 30వేలు, రెండు కిలోవాట్లకైతే రూ. 60 వేలు, మూడు కిలోవాట్లకైతే రూ. 78వేలు చొప్పున భారీ సబ్సిడీలు ప్రకటించింది. దీంతో వేలాదిమంది ఈ స్కీముకు మొగ్గు చూపారు. 2024 జూన్ ఐదో తేదీ నాటికి 1,777 మంది సోలర్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. గుంటూరుజిల్లాలో 917 మంది, బాపట్ల జిల్లాలో 466 మంది, పల్నాడు జిల్లాలో 394మంది సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సోలార్, గ్రీన్ ఎనర్జీలకు ప్రోత్సాహం లభించడంతో ఈ సంఖ్య మరింత వేగంగా పెరిగింది. జూన్, జూలై నెలల్లో ఆ సంఖ్య రెట్టింపు అయింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఎస్సీ కుటుంబాలు, డ్వాక్రా మహిళల కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని భావిస్తున్న నేపథ్యంలో పథకం ప్రాధాన్యం మరింత పెరిగింది.

చెల్లింపు నిల్.. బాదుడు ఫుల్

గత వైసీపీ ప్రభుత్వం 8 సార్లు కరెంటు బిల్లులు పెంచి మోత మోగిస్తుం డడంతో సోలార్ పెట్టుకుంటే కరెంటు బిల్లు చెల్లించే బాధ తప్పుతుందన్న ఆశతో చాలా మంది సోలార్ వైపు మొగ్గు చూపారు. బ్యాంకుల ద్వారా రుణం రూ. 2 లక్షలు తీసుకుని ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారు. అయినప్పటికీ కరెంటు బిల్లుల వాత మాత్రం వినియోగదారులకు తప్ప లేదు. అప్పు చేసి ప్లాంటు పెట్టుకుని ప్రతి నెలా ఈఎంఐలు కట్టుకోవ డంతోపాటు నెలనెలా బిల్లులు కట్టుకోవాల్సి వస్తుండడంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు. తాము కరెంటు ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి సరఫరా చేస్తూ కూడా ఈ బిల్లుల మోతేంటో అర్థం కాక అల్లాడుతున్నారు. స్థిర చార్జీలు, కన్స్యూమర్ చార్జీలు, గ్రిడ్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల రూపంలో ప్రతి నెలా 300 రూపాయల బిల్లు వస్తోంది. ఈ బిల్లులు ఏ నెలకానెల వసూలు చేస్తున్న డిస్కమ్ అధికారులు తమకు చెల్లిం చాల్సిన మిగులు విద్యుత్ బకాయిలను మాత్రం నెలల త రబడి వాయిదా వేస్తుండడంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రతి నెలా రూ. 2,000 నుంచి 3,500 వరకూ ఈఎంఐలు కట్టుకుంటున్న లబ్ధిదా రులకు కరెంటు బిల్లులు కూడా తోడై మోతమో గిస్తుండడంతో లబ్ధిదా రుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం చేపడుతున్న గ్రీన్, సోలార్ ఎనర్జీ ప్రోత్సాహక కార్యక్రమానికి ప్రతిబంధకంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. తక్షణం లబ్ధిదారుల విద్యుత్ బకాయిలు చెల్లించకపోతే ఆందోళ మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.



మిగులు విద్యుత్తుకు చెల్లింపులు ఎక్కడ?

పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారులు 'ఆన్ గ్రిడ్' పద్ధతిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఆన్ గ్రిడ్ అంటే.. సోలార్ ద్వారా తయారైన విద్యుత్ గ్రిడ్‌కు వెళ్లిపోతుంది. గ్రిడ్ ద్వారా వచ్చే విద్యుత్‌ను వినియోగదారుడు వాడుకుంటాడు. ఈ రెండింటినీ లెక్కగట్టి బిల్లు వేస్తారు. వినియోగదారుడు వాడుకున్న విద్యుత్తు కంటే, ఉత్పత్తి చేసిన విద్యుత్తు ఎక్కువగా ఉంటే దాన్ని మిగులు విద్యుత్తుగా ప్రకటిస్తారు. ఆ మిగులు విద్యుత్తును విద్యుత్ శాఖ వినియోగదారుడి నుంచి కొనుగోలు చేసి నగదు చెల్లిస్తారు. గతంలో యూనిట్‌కు రూ. 4.17గా ధర నిర్ణయించగా, తాజాగా దానిని రూ. 2.49 పైసలకు సవరించారు. ప్రతి ఏటా నిర్ణయించిన ధర ప్రకారం ఆరు నెలలకు ఒకసారి జూన్, డిసెంబరులో లెక్కచూసి వినియోగదారుడికి నగదు చెల్లించాలి. అయితే సోలార్ ప్లాంటు పెట్టుకుని 9, 10 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ మిగులు విద్యుత్ లెక్కలు వేయకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

నిర్లక్ష్యం.. గందరగోళం

ఆరు నెలలకు ఒకసారి సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని లెక్కించాల్సిన అధికారులు ఆ పని చేయకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సమస్య గురించి కనుక్కునేందుకు డిస్కమ్‌కు వెళ్లిన వినియోగదారులు, మరింత ఆందోళనకు గురవడం తప్ప ప్రయోజనం ఉండడం లేదు. గతంలో సోలార్ ప్లాంటుకు అనుమతిచ్చిన ఆపరేషనల్ అధికారులు, ఇప్పుడు అది తమ పని కాదని రెవెన్యూ కార్యాలయానికి వెళ్లాలని చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ సాంకేతిక సమస్యను అధికారులు పరిష్కరించి, సరళతరం చేస్తే లబ్ధిదారులకు మేలు జరుగుతుంది. కాగా రెవిన్యూ అధికారులను చెల్లింపుల గురించి అడిగితే.. నిధులు లేవని, కిందటి చెల్లింపులే ఇంకా పూర్తి కాలేదని, అవి పూర్తయ్యాక ప్రస్తుత బిల్లులు చూస్తామని చెబుతున్నారు. తక్షణం ప్రభుత్వం నిధులు విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నారు.

పింఛన్ల పంపిణీకి అధునాతన పరికరాలు

● 5157 డివైజ్‌లను పంపించిన ప్రభుత్వం ● సచివాలయాల సిబ్బందికి అందజేసిన కలెక్టర్

గుంటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ తేదీ వస్తుందంటే కొంత మంది సిబ్బందికి, పెన్షన్‌దారులకు ఉత్కంఠే. ఇందుకు కారణం ఫేస్ రికగ్నిషన్ సరిగా జరగవు. దాంతో వాళ్ల పింఛన్లను పక్కన పెట్టి వేరే వాళ్ల ఇళ్లకు వెళ్లి పంపిణీ పూర్తి చేసుకుని తిరిగి ఎవరివైతే పడలేదో మళ్లీ ఆయా పింఛన్‌దారుల ఇళ్లకు సచివాలయాల సిబ్బంది వెళ్లాల్సిన పరిస్థితి. ఈ కారణంగా గంటల వ్యవధిలో పంపిణీ పూర్తికావాల్సిన పింఛన్లు కొన్ని సచివాలయాల పరిధిలో ఆ రోజు సాయంత్రానికో... మరుసటి రోజుకో పూర్తి అవుతున్నాయి. ఈ సమస్య అన్ని చోట్ల ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడెడ్ వెర్షన్‌తో కొత్త పరికరాలను ఆర్డర్ చేసి తెప్పించుకొన్నది. వాటిని సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు పంపించగా కలెక్టర్ నాగలక్ష్మి కొంతమంది సచివాలయాల సెక్రెటరీలకు పంపిణీ చేశారు.

గుంటూరు జిల్లాలో ప్రస్తుత మార్చి నెలలో 2 లక్షల 52 వేల 585 పింఛన్లను లబ్ధిదారులకు ప్రభుత్వం విడుదల చేసింది. వాటిల్లో 2 లక్షల 47 వేల 951 (98.17 శాతం మందికి) పంపిణీ చేశారు. ఎవరికైతే ఫేస్ రికగ్నిషన్ జరగదో వాళ్లకి ఆర్‌బీఐఎస్ అనే యాప్ ద్వారా సెక్రెటరీలు పంపిణీ చేస్తున్నారు. దీనివలన కొంత సమయం వృథా అవుతున్న దృష్ట్యా వెర్షన్ ఎల్ జీరో నుంచి ఎల్-1కు అప్‌గ్రేడ్ చేసిన పరికరాలను ప్రభుత్వం పంపించింది. జిల్లాకు 5,157 పరికరాలు రాగా వాటిని సచివాలయాల సిబ్బందికి పంపిణీ చేస్తున్నారు. ఇవి వేలిముద్రలను కూడా అథెంటికేషన్ చేస్తాయి. ఈ నేపథ్యంలో 99.99 శాతం మందికి ఫేస్ రికగ్నిషన్/వేలిముద్రల ద్వారా అథెంటికేషన్ జరిగిపో తుందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ కొత్త పరికరాల ద్వారా పెన్షన్ల పంపిణీని చేపడతారు.

కాగా కొత్త డివైజ్‌లను ఇవ్వడానికి పాత పరికరాలు తెచ్చి ఇవ్వమన్న షరతుని డీఆర్‌డీఏ పెట్టింది. అయితే తాము నాలుగేళ్ల క్రితం మునిసిపల్ ఎన్నికల సమ యంలో వాటిని సంబంధిత మునిసిపల్ కార్పొరేషన్ లు/మునిసిపాలిటీలకు స్వాధీనం చేశామని, వాటిని ఆయా సంస్థల వద్ద కలెక్ట్ చేసుకోకుండా తమని తీసుకురమ్మనడం ఎంతవ రకు సబబని సచివాలయాల సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని వాళ్లు కోరుతున్నారు.



సచివాలయాల సిబ్బందికి పింఛన్ల పంపిణీ పరికరాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఉపాధి లక్ష్యంగా.. పీఎం ఇంటర్న్‌షిప్

● పది నుంచి డిగ్రీపూర్తి చేసిన వారికి అవకాశం



- వయో పరిమితి 21 నుంచి 24 సంవత్సరాలు
- ఉచిత రిజిస్ట్రేషన్, దరఖాస్తు సౌలభ్యం
- నెలాఖరుతో ముగియనున్న గడువు

గుంటూరు(విద్య),మార్చి 17(ఆంధ్రజ్యోతి): యువతకు సరికొత్త సాంకేతిక నైపుణ్యాలు నేర్పించి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రారంభించిన పథకం పీఎం ఇంటర్న్‌షిప్. ఈ స్కీమ్ రెండో విడత కార్యక్రమానికి దరఖాస్తులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఇందులో 300కు పైగా కంపెనీల్లో లక్షకు పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తాయి. ఇందుకోసం ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. అర్హులు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://pmintership.mca.gov.in/login అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ తర్వాత దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్, దరఖాస్తుకు ఎలాంటి రుసుం లేదు.

ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా.....

- రాబోయే ఐదేళ్లలో టాప్ 500 కంపెనీల్లో కోటి మందికి నైపుణ్యాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది.
- ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5,000 చొప్పున ఏడాది పాటు ఆర్థిక సహాయం అందిస్తారు.
- కంపెనీలో చేరే ముందు రూ.6,000 (వన్‌టైం గ్రాంట్) కూడా ఉంటుంది. అంటే మొత్తం మీద ఏడాదిలో రూ.66,000 పొందుతారు.

ఈ పథకంలో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యే కంపెనీలు ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ అందిస్తాయి. ఇందులో కనీసం సగం కాలం తరగతి గదిలో కాకుండా వాస్తవ ఉద్యోగ వాతావరణంలో అభ్యర్థులు గడపాల్సి ఉంటుంది. ఈ పథకంలో ఏదైనా కంపెనీ/బ్యాంకు/ఆర్థిక సంస్థలు సదరు మంత్రిత్వ శాఖ ఆమోదంతో చేరొచ్చు.

జాబ్ చేస్తూ ఏఐ స్కిల్స్ పెంచుకొనేలా.. ఐఐటీ మద్రాస్ సరికొత్త కోర్సులు రూపొందించింది. ఇంటర్న్‌షిప్‌లో చేరినవారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉంది. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా బీమా కల్పిస్తారు. దీనికి కావాల్సిన ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది.



అర్హులు ఎవరంటే....

కొన్ని నిబంధనలకు లోబడి 21 నుంచి 24 ఏళ్ల మధ్య ఉన్న యువతీ యువకులు ఈ పథకానికి అర్హులు. ఆన్‌లైన్, దూరవిద్య ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్నవారితో పాటు ఎస్ఎస్‌సీ పాసైన అభ్యర్థులతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్, బీఏ, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీ ఫార్మసీ వంటి డిగ్రీలు కలిగి ఉన్నవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ప్రభుత్వ ఉద్యోగా లు చేసేవారి కుటుంబాలకు చెందినవారు, వార్షికాదాయం రూ.8లక్షలు దాటిన కుటుంబాలతో పాటు ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థల్లో గ్రాడ్యుయేషన్ చేసినవారు, సీఏ, సీఎంఏ అర్హత కలిగినవారు ఈ ఇంటర్న్‌షిప్‌కు అనర్హులు.

పదో తరగతి పరీక్షల్లో ప్రశ్నపత్రం తారుమారు

- ఇన్విజిలేటర్ సస్పెన్షన్
- సీఎస్, డీవోలకు మెమో
- మొదటి రోజే గందరగోళం
- విద్యార్థికి న్యాయం చేస్తామని హామీ

తెనాలి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలలో ప్రశ్నపత్రం తారుమారు అయింది. ఇందుకు కారణమైన ఇన్విజిలేటర్‌ను డీఈవో సస్పెండ్ చేశారు. ఆ కేంద్రంలో సీఎస్, డీవోలను సంజాయిషీ కోరారు. గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో సోమవారం తెలుగు పరీక్షకు గాను సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థి ధనుశ్రీకి ఇన్విజిలెటర్ నీలిమ ప్రశాంతి ఇవ్వాల్సిన ప్రశ్నాపత్రానికి బదులు మరో ప్రశ్నపత్రం ఇచ్చారు. కాంపోజిట్ కోర్సులో ఉన్న ఆ విద్యార్థి 80 మార్కుల తెలుగు ప్రశ్నపత్రం రాయాల్సి ఉండగా, 100 మార్కుల ప్రశ్నపత్రం తీసుకుని పరీక్ష రాసింది. పరీక్ష పూర్తయ్యాక బయటకు వచ్చిన విద్యార్థి వద్ద స్కూల్ టీచర్ ఆ ప్రశ్నపత్రం చూసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యాశాఖాధికారులు సదరు విద్యార్థి జవాబు పత్రాలను ప్రత్యేకంగా సీల్ చేసి విషయాన్ని వివరిస్తూ నివేదిక ఇచ్చారు. సదరు విద్యార్థికి న్యాయం చేస్తామని జిల్లా విద్యా శాఖ హామీ ఇచ్చింది. 100 మార్కుల ప్రశ్నా పత్రంలో 80 మార్కుల వరకు మూల్యాంకనం చేస్తామని స్పష్టం చేశారు. మరో 20 మార్కుల సంస్కృత ప్రశ్నపత్రాన్ని ఆ పరీక్ష రోజున రాయిస్తామని చెప్పారు. నిర్లక్ష్యం చూపిన ఇన్విజిలెటర్ నీలిమ ప్రశాంతిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సి.రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. ఆ కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను సంజాయిషీ కోరారు.

నాటకుండా.. నటించారు

వనమహోత్సవంపై అధికారుల నిర్లక్ష్యం

గ్రామాల్లో గుట్టలుగుట్టలుగా పడి ఉన్న మొక్కలు

పెదనందిపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించిన వనమహోత్సవం స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో వెలవెలపోయింది. విస్తృతంగా మొక్కలు నాటి గ్రామాలను హరిత వనాలుగా తీర్చిదిద్ది పర్యావరణాన్ని పరిరక్షించాలనేది ప్రభుత్వ ఉద్దేశం ఉపాధి, పంచాయతీరాజ్ శాఖల మధ్య సమన్వయ లోపంతో నీరుగారిపోయింది. పల్లె ముంగిట ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం ఉండాలన్న లక్ష్యంతో గత ఏడాది ఆగస్టులో వనహోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించగా అధికారులు మమ అనిపించారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పంచాయతీకి సరఫరా చేసిన మొక్కలను నాటకుండా వదిలేశారు. ప్రజలకు ప్రాణవాయువులు అందించాల్సిన మొక్కలు అధికారుల నిర్వాకంతో పంచాయతీ కార్యాలయాల వద్ద గుట్టలు గుట్టలుగా పడేశారు. వనమహోత్సవంపై అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడడంతో కొన్ని గ్రామాల్లో మొక్కలు నాటకుండానే ఎండిపోతున్నాయి.



పెదనందిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఎండిపోయిన మొక్కలు



ఏజీపాలెం జడ్పీ పాఠశాలలో గుట్టలుగా పడవేసిన మొక్కలు

పశ్చిమ డెల్టాకాల్వకు 516 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 516 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 96, రేపల్లెకాల్వకు 110, తూర్పుకాల్వకు 145, పశ్చిమకాల్వకు 140, నిజాం పట్నంకాల్వకు 100, కొమ్మమూరుకాల్వకు 653 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల మార్కెట్‌లో పసుపుధరలు

దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 410 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.7,750, గరిష్ఠధర రూ.9000, మోడల్‌ధర రూ.9000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.7,750, గరిష్ఠధర రూ. 9,700, మోడల్‌ధర రూ. 8,900 పలికాయి.

చేనేతలకు ఉచిత విద్యుత్తుపై హర్షం

మంగళగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడంపై ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వెలిబుచ్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానానికి అనతి కాలంలోనే ఆమోదముద్ర వేయడం అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

తాడేపల్లి (కుంచనపల్లి), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కును టీడీపీ నాయకులు సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కుంచనపల్లికి చెందిన జంపాల వెంకటేశ్వరరావు గుండె, ఊపిరితిత్తుల ఆపరేషన్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ. లక్షా25వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు బాధిత కుటుంబసభ్యు లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల సహాయార్థం సీఎం చంద్రబాబు సహృదయంతో సహాయ నిధులు విడుదల చేయడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో కుంచనపల్లి జనసేన పార్టీ అధ్యక్షుడు మేకల రాజా, పసుపులేటి అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలి

● పాశం రామారావు

కాకుమాను, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండపాటూరులో ముస్లింల స్మశాన వాటిక గ్రామంలో ఉందని ఆ స్మశాన వాటికను గ్రామానికి వెలుపల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పని చేయాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొండపాటూరులో సోమవారం ఎస్సీ, ఎస్టీ, ముస్లిం కాలనీలో సీపీఎం నాయకులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లింలకు కేవలం 15 సెంట్లు మాత్రమే ఉందని ఆయనకు స్థానికులు వివరించారు. అలాగే ఎస్సీల స్మశాన వాటికకు కూడా పడమర వైపు ఉన్న ఎకరాన్ని అదనంగా కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొత్త వెంకట శివరావు, రమేష్, నల్లమోతు రాజేంద్ర, టీడీ ప్రసాద్, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య


వెంకట సత్యనారాయణ మృతదేహం

ఫిరంగిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 113 తాళ్ళూరుకి చెందిన డేగల వెంకట సత్యనారాయణ (36) నాలుగు సంవత్సరాల నుంచి పొలం కౌలుకు తీసుకొని మిరప తోట సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా రెండున్నర ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని మిరప పంట వేశాడని స్థానికులు తెలిపారు. దీంతో అప్పుల పాలై ఏడాదికి ఏడాది నష్టం వచ్చి ఈనెల 16వ తేదీన తన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని చనిపోయాడు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిరంగిపురం పోలీసులు కేసు నమోదు చేసి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో శవ పంచనామ చేశారు. అతడికి కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతిపై దర్యాప్తు చేస్తున్నామని ఫిరంగిపురం భీమ రవీంద్ర బాబు తెలిపారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కనకదుర్గమ్మ వారధి వద్ద కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం తాడేపల్లి పోలీసులు కనుగొన్నారు. వారధి 28వ కానా వద్ద నీటిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. అతడికి 30 సంవత్సరాల వయస్సు ఉండొచ్చని, ఒంటిపై సిమెంటు రంగు ప్యాంటు, బ్లూ రంగు చొక్కా ఉన్నాయని, ఇతర వివరాలు లభ్యం కాలేదని, మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉందని, పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

దుగ్గిరాల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రేవేంద్రపాడుకు చెందిన మహిళను అదేగ్రామానికి చెందిన వ్యక్తి వేధిస్తున్నాడంటూ దుగ్గిరాల పోలీసులకు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొప్పుల కోటేశ్వరరావు తనను తరచూ వేధిస్తున్నాడంటూ, అదేగ్రామానికి చెందిన హిమజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు.

స్వచ్ఛ మంగళగిరికై అడుగులు

● మంత్రి లోకేశ్ ఆదేశాలతో అధికారుల చర్యలు
● చెత్త రహిత నగరంగా ఎంటీఎంసీ
● నెల రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య పనులు
● అదనంగా 75 మంది పారిశుధ్య కార్మికులు


ప్రత్యేక పారిశుధ్య పనుల్లో భాగంగా రోడ్లను శుభ్రం చేస్తున్న ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది

మంగళగిరి సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. స్వచ్ఛ మంగళగిరి పేరిట నెల రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా మంగళగిరి కొత్తపేటలో అధికారులు, స్థానిక నాయకులు స్వచ్ఛ మంగళగిరిపై అవగాహన కల్పిస్తూ సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛ మంగళగిరి ప్రాముఖ్యాన్ని వివరించారు. ఎంటీఎంసీ సిబ్బంది, నాయకులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మురుగు కాల్వల్లో చెత్త వేయవద్దని, ప్లాస్టిక్ సంచులు వాడవద్దని, తడి-పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని కోరారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్మికుల పనితీరు, డ్రెయిన్లలో పూడికతీత పనులపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భం గా ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా మాట్లాడు తూ ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు స్వచ్ఛ మంగళగిరికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. 65 సచివాలయాల పరిధిలో నెలరోజులపాటు ప్రత్యే క పారిశుధ్య పనుల ద్వారా చెత్తను తొలగించ డం, ప్రతి ఇంటికీ వెళ్లి పారిశుధ్యంపై అవగా హన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహి స్తామన్నారు. స్వచ్ఛ మంగళగిరి కోసం అదనంగా 75 మంది పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకున్నట్టు చెప్పారు. మంత్రి నారా లోకేశ్ సూచన లతో ఎంటీఎంసీని వంద శాతం చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ అదనపు కమిషనర్ కే శకుంతల, కార్యదర్శి ఎం.దివ్యకుమారి, డీఈఈ రమేష్, ఏఈ ప్రసన్న జ్యోతి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సుస్మిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, టీడీపీ నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, రంగిశెట్టి నరేంద్ర, సుఖమంచి గిరిబాబు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి టౌన్(ఆంధ్రజ్యోతి):** తాడేపల్లి మహానాడులో స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం జరిగింది. మణిపాల్ ఆస్పత్రి నుంచి మహానాడు వరకు ర్యాలీ చేపట్టారు. రోడ్ల వెంబడి, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను తొలగించారు. స్వచ్ఛ మంగళగిరి కోసం తోడ్పాటు నందిస్తామని ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, టీడీపీ నేతలు వల్లభనేని వెంకట్రావు, దారా దాసు, అద్దంకి మురళీ, కేళి వెంకటేశ్వరరావు, ఇట్టా భాస్కర్, గొర్ల వేణు గోపాల్‌రెడ్డి, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, కుసుమ, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు ప్రారంభం


ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలలో రూం నెంబర్లు చూస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రారంభమైనట్లు విద్యాశాఖ అధికారలు తెలిపారు. మండలంలో మొత్తం మూడు పాఠశాలల్లో మొత్తం 485 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ప్రత్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, శ్రీనివాస పాఠశాలలో 101 మంది విద్యార్థులు, చినకోండ్రుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 184 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

కాకుమాను(ఆంధ్రజ్యోతి): కాకుమాను, చిన్నలింగాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తంగా 223 మంది విద్యార్థులు కాకుమాను పరీక్ష కేంద్రంలో పరీక్షలకు హాజరయ్యారు. తహసీల్దార్ వెంకట స్వామి, ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏబీపాలెం, పెదనందిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన పరీక్షలకు 314 మంది విద్యార్థులకు గానూ 313 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐ సాహితీమోహన్ పరిశీలించారు.

వట్టిచెరుకూరు (ఆంధ్రజ్యోతి): వట్టి చెరుకూరు జడ్పీ హైస్కూల్, గారపాడు, అనంతవరప్పాడు గ్రామాల్లోని జడ్పీ హైస్కూళ్లలోని పరీక్ష కేంద్రాలకు తొలి రోజు కావటంతో విద్యార్థులు 9 గంటలకే చేరుకున్నారు. 405 మంది విద్యార్థులకు 395 మంది విద్యార్థులు హాజరైనట్టు అధికారులు వెల్లడించారు.

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 631 మంది విద్యార్థులకు గానూ, 626 మంది హాజరయ్యారని ఎంఈవో కాజ శ్రీనివాసరావు తెలిపారు. ఐదు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ జరుగుతుండగా పెదకాకాని ఎంఈవో శంకరాజు బృందం తనిఖీలు నిర్వహించారు.

బడ్జెట్‌లో చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి



బడ్జెట్‌లో చేనేతకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న చేనేత కార్మిక సంఘం నేతలు

మంగళగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ను సవరించి చేనేత రంగానికి రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో చేనేతకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సీపీఐ, చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతకు కేవలం రూ.138 కోట్లు మాత్రమే కేటాయించి దారుణంగా మోసం చేసిందన్నారు. వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్ద రంగమైన చేనేతను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేనేతకు రూ.200 కోట్లు కేటాయిస్తే ఇంతకన్నా మెరుగైన బడ్జెట్ ఇస్తామని చెప్పిన కూటమి నేతలు మాట తప్పారని విమర్శించారు. చేనేత సహకార సంఘాలకు బకాయిలను వెంటనే చెల్లించాలని, బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బత్తూరి మోహన్, అధ్యక్షుడు గజవల్లి వెంకట కృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ రావు, నేతలు నందం బ్రహ్మేశ్వరరావు, దొడ్డి ఈశ్వరరావు, మునగాల హరి, కొల్లి కిశోర్, బండి నాగేంద్రరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

● ఇన్‌చార్జి ఎంపీడీవో పూర్ణ శంకరరావు

మేడికొండూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పూర్ణ శంకరరావు సోమవారం తెలిపారు. బీసీలు(కాపు, బలిజ, తెలగ, ఒంటరి)తో పాటు ఈబీసీ (కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ)వర్గాలకు ఆయా కార్పొరేషన్‌ల ద్వారా రుణాల మంజూరుకు ఈనెల 22వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా కాని గ్రామ సచివాలయాలు, మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మేడికొండూరు మూడు జనరిక్ ఫార్మసీ షాపులు మంజూరు చేస్తారని, ఈ షాపులకు బీసీ, కమ్మ, రెడ్డిలకు కేటాయించారని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

బీసీ సేవా కోఆపరేటివ్ లిమిటెడ్ గుంటూరు వారి ద్వారా మేడికొండూరు మండలం నుంచి అర్హులైన బీసీ, ఈడబ్ల్యూఎస్ చెందిన మొత్తం 232 మంది మహిళలకు బేసిక్ టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో పూర్ణశంకరరావు తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా 65మంది బీసీ మహిళలను, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ద్వారా కులాల వారీగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. వెబ్‌సైట్ https://apobmm s.apcfss.in/ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 22వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముస్లిం శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

దుగ్గిరాల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మోరంపూడిలో తమకు శ్మశానవాటిక లేక దశాబ్దాల కాలంగా ఇబ్బందులు పడుతున్నామని, స్థలం కేటాయించాలంటూ ముస్లింలు తహసీల్దార్‌కు వినతపత్రం అందించారు. శ్మశానవాటిక లేక కాల్వగట్టునే మృతదేహాలను ఖననం చేస్తున్నామని, తమకు స్థలం మంజూరు చేయించాలని వినతిపత్రంలో కోరారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందించారు. మౌజన్ అజ్జర్‌వలి, కరీముల్లా, వలీబాయ్, శ్రీనుబాషా, రవికాంత్, షేక్ మస్తాన్, బడేమియా, సలీమ్, షేక్ శిలార్ తదితరులు పాల్గొన్నారు. పందులు పొలాల్లో పడి మొక్కజొన్నలు తింటుండటంతో తాము నష్టపోతున్నామని, వాటిని నియంత్రించి ఆదుకోవాలని రైతులు పసుపులేటి నాగయ్య, మోహనకృష్ణ కోటేశ్వరరావు తదితరులు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

పెదనందిపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలలో తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. స్థానిక సోమేశ్వరస్వామి కాలక్షేప కళ్యాణ మండపంలో సోమవారం బీజేపీ నూతన మండల కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. దేశంలో బీజేపీ సిద్ధాంతాలు కలిగిన పార్టీ అని సమర్థవంతులైన నాయకులు ఉన్నారన్నారు. 12 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ముందుడగు వేసేందుకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. గ్రామాల్లోని ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రజలకు అర్హులైన వారిని గుర్తించి వారి పథకాలు అందేలా అధికారులు దృష్టికి తీసుకువెళ్లేలా నాయకులు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపికైన మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్, ప్రధాన కార్యదర్శులు బీమినేని రవి, శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వెలగా హిమజ్యోతితో పాటు 11 మందితో ప్రమాణ స్వీకారం చేయించారు.

కార్మికుల పెండింగ్ వేతనాల చెల్లించాలి

తుళ్లూరు, మార్చి17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, హైకోర్టు, రాజధాని గ్రామాల్లో పనిచేసే కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబూరావు, రాజధాని నేతలు సోమవారం సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ఇస్తున్న రూ.12వేల వేతనాన్ని రూ.21వేలకు పెంచాలని, కార్మికులు సంఖ్య పెంచాలని, కార్మికులకు నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఆ వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నేతలు ఎం రవి, ఎం భాగ్యరాజు, బుజ్జి, శ్రీలత, చిట్టిబాబు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

జనవాణిలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ


జనవాణిలో అర్జీలు స్వీకరిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి లోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పార్టీ నేతలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తక్షణ పరిష్కారం అవసరమైన సమస్యలను అధికారులకు ఫోను ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కే శివపార్వతి, ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, నేతలు జయలక్ష్మి, పర్వతం మధుసూదనరావు, బడే కోమలి, సామల నాగేశ్వరరావు, చిట్టెం అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై క్యాబినెట్ ఆమోదం హర్షణీయం

● ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఏసుపాదం

పెదనందిపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పై రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ నివేదికకు క్యాబినేట్ ఆమోదం పట్ల ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీని అమలు చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నూతన వధూవరులకు పెళ్లికానుక


ఈమనిలో నూతన వధూవరులకు పెళ్లికానుకగా నారా లోకేశ్ పంపిన నూతన వస్త్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

దుగ్గిరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఈమనికి చెందిన నూతన వధూ వరులు, టీడీపీ కార్యకర్త కాకుమాను రమేష్‌బాబు కుమార్తె రాశి, అల్లుడు శ్యామ్‌మనోహర్‌లకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను సోమవారం అందించారు. నూతనవస్త్రాలను టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, సర్పంచ్ సిద్దెల శ్రీవాణి ఉజ్వల హరిణి, ఎంపీటీసీ నిర్మల, కాబోతు దేవదాసు, చొప్పర రోశయ్య, అంచే రవిచంద్, ఏనుగంటి సురేష్, కొమ్మినేని శ్రీను, తదితరుల చేతుల మీదుగా అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రీసెర్చ్ వర్క్ పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న ఏఎన్‌యూ వీసీ గంగాధర్

పెదనందిపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలకు చెందిన ప్రిన్సిపల్ జీ వీరరాఘవయ్య రచించిన రీసెర్చ్ వర్క్ క్రౌన్ పబ్లిషింగ్ పుస్తకాన్ని ఏఎన్‌యూ ఉపకులపతి గంగాధర్ సోమవారం ఏఎన్‌యూలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచనలకు సహకరించిన కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ(విశ్రాంత ఏఎస్పీ) కళాశాల సెక్రటరీ, అండ్ కరస్పాండెంట్ లావు రత్తయ్య, కోశాధికారి లావు ఆదిశేషయ్య, జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

కేఎల్‌యూలో క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాపు


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 17(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కేఎల్‌యూ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా యూనివర్సిటీ బీసీఏ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, పైథాన్‌లలో నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు ఆరు రోజుల వర్క్‌షాపును ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి సోమవారం ప్రారంభించారు. ఈ వర్క్‌షాపులో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి వచ్చిన నలుగురు ట్రైనర్లు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని ఆచార్య సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు గ్లోబల్ సర్టిఫికేషన్‌ను సాధించడమే కాకచక్కని ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో వీసీ సారధివర్మ, ప్రోవీసీలు ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు మంత్రి లోకేశ్ చేయూత

● తోపుడు బండ్లు, ప్లాట్‌ఫారం రిక్షాల పంపిణీ


చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో చిరువ్యాపారులకు తోపుడు బండ్లు, ప్లాట్‌ఫారం రిక్షా అందజేశారు. పట్టణంలోని 27వ వార్డుకు చెందిన సనంగుల పెదకొండయ్య, బాలాజీనగర్‌కు చెందిన దండిగిరి వెంకటరత్నకు తోపుడు బండ్లు, 24వ వార్డుకు చెందిన కర్నాటి నాగేశ్వరరావుకు ప్లాట్‌ఫారం రిక్షాను స్థానిక టీడీపీ నేతల ద్వారా సోమవారం పంపిణీ చేయించారు. అలాగే, మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన షేక్ అల్లాభక్షు, రాయపాటి దమయంతికి తోపుడు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద, బలహీన వర్గాల వారికి మంత్రి నారా లోకేశ్ వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా అండగా నిలుస్తున్నారని చెప్పారు. మంత్రి లోకేశ్ అందించిన తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, ప్లాట్ ఫారం రిక్షాలు, ఇస్త్రీ బండ్లు చిరువ్యాపారుల జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు కొతరపు శ్రీనివాసరావు, గంజి చంద్రశేఖర్‌రావు, రుద్రు కోటేశ్వరరావు, వంగర హనుమాన్, ఊట్ల శ్రీమన్నారాయణ, కొల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభంపై వెలిగే దీపంతోనే ప్రయాణాలు

● డేగల ప్రభాకర్


శ్రీవేణుగోపాల స్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న డేగల ప్రభాకర్

ఫిరంగిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాజుల పరిపాలనా కాలంలో రహదారి నిర్మాణాలు లేక ఆలయ ధ్వజ స్తంభాల మీద వెలిగే దీపం చూసి ప్రయాణం సాగించేవారని రాష్ట్ర ఇండస్ట్రీ యల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నా రు. సోమవారం మండలంలోని 113తాళ్ళూరులో శ్రీరుక్మిణీ సత్య భామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారి ఆలయంలో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన చేసిన ఆయన మాట్లాడారు. రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరారు. ప్రతిష్ఠా పన కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు డేగల ప్రభాకర్ దంపతుల సమక్షంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన, రత్నన్యా సం, అగ్ని ధ్యానం, ఉక్త హోమాలు, పూర్ణాహుతి, శాంతి కల్యాణ పూజలు, వేద మంత్రోచ్చారణలతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠింప చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ డేగల ప్రభాకర్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అర్చకులు బీ ప్రసన్నమూర్తి, వేద పండితులు బీ పవన్‌కుమార్, దేవదాయ శాఖ అధికారి జక్కా శ్రీనివాసరావు, గ్రామంలోని పెద్దలు, భక్తులు, గ్రామస్థులు వందలాదిగా పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : ఉప్పుటూరి చిన్నరాములు


పరీక్షలకు హాజరైన విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్‌లు పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చిన్నరాములు

కాకుమాను, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉప్పుటూరి చిన్నరాములు సేవాట్రస్టు చైర్మన్ రామ్ చౌదరి (ఎన్ఆర్ఐ) తండ్రి ఉప్పుటూరి చిన్నరాములు అన్నారు. కాకుమాను, చిన్నలింగాయపాలెంలో పది పరీక్షలకు హాజరైన విద్యార్థులకు సోమవారం ఉప్పుటూరి ట్రస్టు ఆధ్వర్యంలో 300 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పుటూరి చిన్నరాములు మాట్లాడుతూ ప్రాథమిక విద్య, ఉన్నత విద్యకు ప్రాధాన్యమివ్వాలని విద్యార్థులకు సూచించారు. విద్యాభివృద్ధికి ట్రస్టు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అలాగే పరీక్షలు జరిగే ప్రతి రోజు విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్‌లు పంపిణీకి అవసరమయ్యే నగదును ఉపాధ్యాయులకు అందించారు. దాత ఉప్పుటూరి చిన్నరాములుకు విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ, ఎంఈవో -2 కొల్లి విజయ భాస్కరరావు, హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయురాలు జవహర్‌రాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మలినేనిలో శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఈసీఈ విభాగాధిపతి విజయసారధి, శిక్షకులు

వట్టిచెరుకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వివిధ సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడతాయని.. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకోవచ్చని డాక్టర్ విజయసారధి తెలిపారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని విద్యాసంస్థల్లో ఆరు రోజుల ప్రయోగాత్మక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ తరగతులు నైపుణ్య శిక్షకులు జీ కిరణ్మయి, టీజీవీ కౌషిక్‌ల పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో మలినేని సంస్థల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు, ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, ఈసీఈ విభాగాధిపతి డీ విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

బుడంపాడులో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం

గుంటూరు (విద్య) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెనాలి రోడ్డులోని బుడంపాడులో సోమవారం జీవీఆర్అండ్ఎస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో రోడ్లను గూర్చి చెత్తను డస్ట్ బిన్లకు తరలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు చైతన్యం కలిగేలా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కరీమున్నీసా, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భాస్కరనాయుడు, డీన్ ప్రసాద్, ఏవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రేపు వాహనాల బహిరంగ వేలం

తెనాలి క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను నిబంధనల మేరకు వేలం నిర్వహిస్తున్నట్లు తెనాలి ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వెంకటాచలం సోమవారం తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో ఉన్న ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను బుధవారం ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు కార్యాలయం నుండి పూర్తి వివరాలు పొందవచ్చని ఆయన తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

కొల్లిపర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుక రీచ్‌ల్లో ఎస్ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయాలనికి తరలించడంతో తహసీల్దార్ సిద్ధార్థ ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.10వేలు జరిమానా విధించారు.

బొప్పాయి మొక్కల నరికివేతపై రైతుల ఫిర్యాదు



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పొన్నూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరంగపురం చానల్ కాలువ కట్టపై బొప్పాయి మొక్కల కొట్టివేతపై రైతులు సోమవారం తహసీల్దార్ జియావుల్ హక్‌కు ఫిర్యాదు అందజేశారు. పట్టణ శివారులో శ్రీరంగపురం చానల్ కాలువ కట్టకు సమీపంలో పండ్ల తోటలు సాగుచేస్తున్న కౌలు రైతులకు చెందిన పంట పొలాలకు సమీపంలో కాలవ కట్ట చుట్టూ రైతులు బొప్పాయి మొక్కలు నాటారు. కాపుకు వచ్చిన బొప్పాయి మొక్కలను సాగునీటి శాఖ సిబ్బంది కొట్టివేశారని ఫిర్యాదులో రైతులు పేర్కొన్నారు. అంతేకాకుండా అభ్యంతరం చెప్పిన తమపై దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి దిగారని ఫిర్యాదులో వివరించారు. దీని పై అధికారులు చర్యలు తీసుకుని సంబంధిత సిబ్బందిని విచారించాలని రైతులు కోరారు.

కార్మికుడు ఆత్మహత్యాయత్నం

తెనాలి, మారీసుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెయింట్ కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. సానికులు తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం కడప ప్రాంతానికి చెందిన ఎం.మోహనరావు సంవత్సరం క్రితం తెనాలి వచ్చి పెయింటింగ్, ఇతర పనులకు వెళ్తూ వచ్చిన డబ్బులతో లాడ్జీలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి కడపలో ఒక మహిళతో వివాహం కాగా వారి మధ్య మనస్పర్ధలు చోటు చేసుకొని వేరువేరుగా ఉంటున్నారు. సోమవారం స్థానిక పాండురంగపేటలో పెయింట్ పనికి అని వచ్చి బ్లేడ్‌తో మెడ భాగంలో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన తోటి కార్మికులు హుటాహుటిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్సను అందిస్తూ ప్రాణాపాయం లేదని వెల్లడించారు. ఘటనపై త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు

రోగులకు దుప్పట్లు పంపిణీ

పొన్నూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిలో సోమవారం రోగులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆర్కే ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి పరిధిలోని టీబీ రోగులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్, ఫౌండేషన్ అధ్యక్షురాలు చింతల రత్నకుమారి, తుమ్మల ప్రశాంత్‌రాజు, సీహెచ్ దివాకర్, స్టీవెన్, శ్రీను, తదితరులతో పాటు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

2న తెనాలిలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

తెనాలి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు తెనాలిలో ఏప్రిల్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి కె.రోహిత్‌వర్మ తెలిపారు. పోటీల కరపత్రాల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పాల్గొనే క్రీడాకారులకు ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ పోటీల్లో గెలిచే క్రీడాకారులు ఉత్తరాఖండ్‌లో జరగనున్న తైక్వాండో పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. ఈదర వెంకటపూర్ణచంద్, కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్రీడాకారులు

పరిహారం అందించరూ..

● సబ్ కలెక్టర్‌కు పసుపు రైతుల వినతి



సబ్‌కలెక్టర్ సంజనా సింహాకు వినతి పత్రం అందజేస్తున్న పసుపు రైతులు

తెనాలి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన పసుపు రైతుల పరిహారం త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు సబ్ కలెక్టర్ సంజనా సింహాకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారి సమస్యను సబ్ కలెక్టర్ ఆలకించి పరిహారం అందించేందుకు తీసుకున్న చర్యలు వివరించారు. క్వింటాకు రూ.7వేలు చొప్పున 296మంది రైతులకు రూ.15 కోట్లు బీమా మంజూరు అయ్యిందని, మరో 173 మంది రైతులు, వ్యాపారులకు సంబంధించి పరిహారంపై పరిశీలన జరుగుతుందన్నారు. అగ్నిప్రమాదం జరిగి ఏడాది పైగా అయ్యిందని, ఏప్రిల్ మొదటి వారంలో నైనా పరిహారం అందేలా చూడాలని సబ్‌కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. రైతులతోపాటు జొన్నా శివశంకరరావు, ములకా శివసాంబిరెడ్డి, వేములపల్లి వెంకట్రావు, సుబ్బారావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘానికి ఐదు అర్జీలు

తెనాలి, మారీసుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగనాథ్ మునిసిపల్ అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒకటి, శానిటేషన్ విభాగానికి ఒకటి, ఇంజినీరింగ్ సెక్షన్‌కు మూడు, అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగనాథ్ తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వేదికకు 13 దరఖాస్తులు

తెనాలి అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 13 దరఖాస్తులు అందాయి. రెవెన్యూశాఖ కు సంబంధించి 5, పోలీసుశాఖ 3, పంచాయతీరాజ్ 3, మునిసిపల్‌శాఖ 2 దరఖాస్తులను సబ్‌కలెక్టర్ తీసుకుని ఆయా శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపారు.

ఇంటి స్థలాలు ఇప్పించరూ...

గుంటూరు(తూర్పు), మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇంటిస్థలాలు, నివాసాలను ఏర్పాటుకు సహకరించాలని పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామ శివారులో నివసించే బేడ, బుడగలు గుంటూరు ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్న గుడిసెలు వేసుకుని గ్రామాల్లో తిరుగుతూ చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నామని, గత వైసీపీ ప్రభుత్వం రాజధాని పరిధిలో ఎర్రబాలెంలో 70మందికి పట్టాలు ఇచ్చిందన్నారు. అ తరువాత కూటమి ప్రభుత్వం ఆ పట్టాలను రద్దుచేసిందని, దీనికితోడు ప్రస్తుతం ఉంటున్న నివాసాలను ఖాళీ చేయాలంటూ స్థల యాజమని ఒత్తిడి చేస్తున్నాడని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి నివాసాలు ఏర్పాటు చేయాలని కోరారు.

రజక భవనానికి కేటాయించిన స్థలాన్ని అప్పగించండి

రజక సంఘానికి గతంలో కేటాయించిన స్థలాన్ని అప్పజెప్పాలని కొల్లిపర గ్రామానికి చెందిన రజక సంఘ నాయకుడు రంపాటి వెంకటేశ్వరరావు అర్జీ అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 12 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని గతంలో పంచాయతీ తీర్మానం చేసిందని గుర్తుచేశారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం ఆ స్థలాన్ని అప్పజెప్పడంలో కాలయాపన చేసిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీలోపు స్థలాన్ని అప్పజెప్పాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేసినా, స్థానిక ఎమ్మార్వో పట్టించుకోవడం లేదని అన్నారు. కలెక్టర్ స్పందించి ఆ స్థలాన్ని అందజేసి, ఎమ్మార్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు.



అర్జీలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగనాథ్ తదితరులు

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



కొల్లిపర హైస్కూల్లో బోర్డుపై నంబర్లను చూస్తున్న విద్యార్థులు

తెనాలి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తెనాలి డివిజన్‌లో పదో తరగతి పరీక్షలకు 9741మంది విద్యార్థులకుగాను 9679 మంది విద్యార్థులు హాజరయ్యారు. గత ఏడాది ఫెయిల్ అయిన విద్యార్థుల్లో 68 మందికిగాను 51మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షకేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా అవసరమైన వసతులను విద్యాశాఖ ఏర్పాటుచేసింది. పట్టణంలోని 15 పరీక్షా కేంద్రాలలో విద్యాశాఖాధికారులు పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. సోమవారం మొదటి రోజు కావడంతో విద్యార్థులు ఆలయాలలో పూజలుచేసి పరీక్షలకు వెళ్లారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది. విద్యార్థులను తనిఖీచేసి సిబ్బంది లోనికి అనుమతించారు.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మండలంలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం ప్రారంభమైంది. మొదటిరోజు కావడంతో విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాల వద్దకు ముందుగానే చేరుకుని తమ నెంబర్లును సరి చూసుకున్నారు. పరీక్షకు 30 నిమిషాల ముందు వారిని కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థుల సందడితో పరీక్షా కేంద్రాల వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. ఆటోలు, స్కూలు వాహనాలలో చాలామంది విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు తరలివచ్చారు. కొల్లిపర హైస్కూల్‌లో 227మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 226మంది విద్యార్థులు హాజరయ్యారు. అదేవిధంగా వల్లభాపురంలో 94మందికిగాను 89మంది, అత్తోటలో 103మందికి గాను 103 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆయా సెంటర్ల వద్ద ఎస్ఐ కోటేశ్వరరావు ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

పొన్నూరు నియోజకవర్గంలో..

పొన్నూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నేతాజీ నగర్ హైస్కూల్, నిడుబ్రోలు 5వ వార్డు హైస్కూల్, వివేక హైస్కూల్, ఏపీ హైస్కూల్, పచ్చలతాటిపర్రు హైస్కూల్, చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. తొలిరోజు విద్యార్థులను 8:30కే పరీక్ష కేంద్రాల ప్రాంగణంలోకి అనుమతిచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన తాగునీరు విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులను కల్పించారు. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, నారాకోడూరు, వేజెండ్ల జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా దూర ప్రాంతాల విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఫ్రీగా చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.



పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, తనిఖీ చేసి పంపుతున్న సిబ్బంది



చందు సాంబశివరావును సత్కరిస్తున్న పొన్నూరు బ్లడ్‌వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు

రక్తదానాన్ని మరింత ప్రోత్సహించాలి

జనసేన నాయకుడు చందు సాంబశివరావు

పొన్నూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జనసేన నాయకుడు చందు సాంబశివరావు అన్నారు. పట్టణంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన 150 స్వచ్ఛంద సంస్థలకు చెందిన నిర్వాహకులను ఘనంగా సత్కరించి సర్టిఫికెట్‌లు, మెడల్స్‌ను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారికి రక్తదానంలో సేవలు అందిస్తున్న బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు తిరుమలశెట్టి ఉమాశంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు పార్వతినాయుడు, నేషనల్ ఫండమెంటల్ లీగల్ రైట్స్ ఛైర్మన్ కే.కల్పన, మార్క్ వసంత్, రాక్వెల్ గ్రూపు నిర్వాహకులు బీ శేషతల్పశాయి, గగనశ్రీ, రంగిశెట్టి రమేష్, తిరుమలశెట్టి కొండయ్య, ఆరేటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

తెనాలి క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తన అఖండ విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జరుపుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ తెనాలి ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి బాటలో నిలపడానికి పరిణితి చెందిన నాయకత్వ పటిమ గల నాయకులు లభించడం శుభ సూచికమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లు కార్యసాధకులు, లక్ష్యం కోసం శ్రమించడమే వీరికి తెలుసన్నారు. వీరి దీక్ష దక్షతులతో తెనాలి ప్రాంతం మరింతగా అభివృద్ధి బాటలు పడతాయని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవాది వెలినేని రాఘవయ్య మాట్లాడుతూ, ఆలపాటి మొదటి నుంచి పార్టీకి నిబద్ధత కలిగిన వ్యక్తి, త్యాగాలు, ఆటుపోటులను ఎదుర్కొంటూనే ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, వెలివెల రమే ష్, అన్నం పిన్నారావు, జె.శివరామయ్య, ఎంఎన్ జగదీశ్వరాంబ, మద్ది మల్లికార్జునరావు, కనక రాంబాబు, ఇందుపల్లి రాజారామ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి గౌరీశంకర్ పాల్గొన్నారు.

వాసవీ ఆలయంలో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. శ్రీవింధ్య వాసిని సమేత నగరేశ్వరస్వామికి శాంతి కల్యాణం, రథంగ హోమం, దివ్య రథోత్సవం, పూర్ణాహుతి పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ కూచిపూడి నృత్య కళా కేంద్రం నిర్వాహకులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు రామకోటేశ్వర శర్మ, రామలింగశర్మ నిర్వహించిన పూర్ణాహుతిలో వక్కలగడ్డ గంగాధరరావు, హరేరామ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, ధ్వజావరోహణ, మహదాశీర్వచనం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మారుతీ చక్రవర్తి నిర్వహించిన పూజా కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న భక్తులు

చెంచుపేటలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

తెనాలి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చెంచుపేట అమరావతి కాలనీలోని శ్రీగోదా పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. నిత్యహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్కెర తీర్థం కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వెంకటలక్ష్మి శిష్య బృందం కూచిపూడి జానపద నృత్యాలు ప్రదర్శించారు.



పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న భక్తులు



తెల్లజొన్న పంట కంకులు పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ సంచాలకులు విజయసునీత


రైతుల సంక్షేమానికే ప్రభుత్వ ప్రాధాన్యం

● ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

● మార్కెటింగ్ శాఖ సంచాలకులు విజయసునీత

తెనాలి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేసే ప్రతి రైతు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోందని అన్నదాతల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేలా అన్ని విధాలుగా కృషి చేస్తోందని మార్కెటింగ్ శాఖ సంచాలకులు విజయసునీత చెప్పారు. సోమవారం తెనాలి, కొల్లిపర మండలాల్లో అధికారులతో కలిసి విజయసునీత పర్యటించారు. ఈ సందర్భంగా తెనాలి మండలంలోని హాఫ్‌పేట, ఖాజీపేట గ్రామ పంటపొలాల్లో పర్యటించి పెసర సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. సాగుకు పెట్టిన పెట్టుబడి, దిగుబడి, ధరలపై అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు తక్కువ ధరలకు పెసలు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పిస్తూ కొనుగోలు కేంద్రాలు తెరిస్తే తమకు మేలు జరుగుతుందని పలువురు అన్నదాతలు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడి త్వరితగతిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో పర్యటించి బహిరంగ మార్కెట్లో తెల్లజొన్న ఎంతకు కొంటున్నారని రైతులను ప్రశ్నించారు. రూ.2200 నుంచి రూ.2250 వరకూ కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. అనంతరం కొల్లిపరలో పసుపు ఎంతకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించగా దుగ్గిరాల మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాలుకు రూ.8000 నుంచి రూ.11000ల మధ్య ధర లభిస్తుందని పసుపు తెలిపారు. తమకు క్వింటా రూ.12,000ల పైధరకు కొనుగోలు చేస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు ఆమెకు వివరించారు. దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు కాకుమాను శ్రీనివాసరావు, బి.రాజాబాబు, కృష్ణారావు, శ్రీహరిగోపాల్, తెనాలి, కొల్లిపర గుంటూరు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్



నూతన దంపతులకు బొకే అందజేస్తున్న పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహనరెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తెనాలి విచ్చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కుమారిడి పెళ్లి వేడుకల రిసెప్షన్‌కు హాజరయ్యారు. మండలంలోని నందివెలుగు నుంచి వైసీపీ శ్రేణులు ఆయనను ర్యాలీగా ప్రకాశం రోడ్డు, రజక చెరువు రోడ్డు, గాంధీచౌక్, శివాజీ చౌక్ మీదుగా బుర్రిపాలెం రోడ్డులోని వేడుకల ప్రాంతానికి తీసుకువెళ్లారు. జగన్‌మోహన్‌రెడ్డిని భారీ ర్యాలీతో తీసుకురావడంతో ట్రాఫిక్ జామ్‌తో సామన్య ప్రజలు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో ఆయన పాల్గొని దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

● మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్‌ల ద్వారా మంజూరు అయ్యే సబ్సిడీ రుణాల కోసం లబ్ధిదారులు దరఖాస్తులు అందజేయాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు సోమవారం తెలిపారు. బీసీ, ఓబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కార్పొరేషన్ల లబ్ధిదారులు, బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల ద్వారా సబ్సిడీ మంజూరు చేయడానికి దరఖాస్తు చేయలన్నారు. ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 22వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని వివరించారు. పట్టణ ప్రాంతాల వారికి రూ.1,03,000 గ్రామీణ ప్రాంతాల వారికి రూ 81,000 కన్నా తక్కువగా ఆదాయం ఉండాలని కమిషనర్ తెలిపారు. 21 నుంచి 60 సంవత్సరాల లోపు వయసు కలిగి తెల్లరేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఉండాలని తెలిపారు. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలు, పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారాలు, సేవలు, రవాణా విభాగం వంటి సెక్టార్‌లకు సంబంధించిన యూనిట్‌లకు సబ్సిడీ మంజూరు చేయనన్నుట్లు కమిషనర్ వివరించారు.

సామాజిక భద్రత పథకాలలో చేరాలి

యూబీఐ మేనేజర్ మణిభూషన్



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ మణిభూషన్

పొన్నూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సామాజిక భద్రత పథకాలలో ప్రతి ఒక్కరూ చేరాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ మణిభూషన్ అన్నారు. పాత పొన్నూరులో సోమవారం ఆర్థిక అక్ష్యరాస్యతపై అవగాహన సదస్సు జరిగింది. అవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు బ్యాంక్ మేనేజర్లు పాల్గొని పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగదు రహిత లావాదేవీలపై కళాకారులు నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పలు బ్యాంక్ శాఖలకు చెందిన మేనేజర్‌లు సురేష్, సూర్యప్రకాశ్, వెంకటేశ్వర్లు, రిసోర్స్‌పర్సన్ జానకిరామ్, అవార్డు సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.